


'పందిళ్లపల్లి' నుంచి యూరియా సరఫరా

- పరిశీలించిన టెక్నికల్ ఏవో

చింతకాని, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని పందిళ్లపల్లి ర్యాక్ పాయింట్‌లో యూరియా, కాంప్లెక్స్ ఎరువులను సోమవారం పంపిణీ చేశారు. వ్యవసాయ శాఖ టెక్నికల్ ఏవో పవన్‌కుమార్ ఈ ప్రక్రియను పరిశీలించారు. ర్యాక్ పాయింట్‌కు చేరిన 631.8 మెట్రిక్ టన్నుల యూరియా, 499.5 మె. టన్నుల కాంప్లెక్స్ ఎరువులను జిల్లాలోని మార్క్‌ఫెడ్, ప్రైవేటు డీలర్లకు సరఫరా చేశామని పవన్ తెలిపారు.

ఏసీబీకి చిక్కిన అవినీతి చేప



ఏసీబీకి పట్టుబడ్డ జీపీవో శ్రీనివాస్ నాయక్

- సాగు భూమి రిజిస్ట్రేషన్‌కు.. రూ.60వేలు డిమాండ్ చేసిన వేముకుంట జీపీవో
- తొలుత రూ.40వేలు ఇచ్చిన రైతు
- మిగిలినవి ఇస్తేనే పని పూర్తవుతుందంటూ గ్రామ పరిపాలనాధికారి ఇబ్బందులు
- రూ.15వేలు తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు

● వివరాలు 7లో

నగరానికి ₹200కోట్లు

- ఖమ్మంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం
- జీవో విడుదల చేసిన సర్కారు.. ఫలించిన మంత్రి తుమ్మల కృషి







ఖమ్మం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : నగరంలో తాగునీటి సమస్యకు చెక్ పడనుంది. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా ప్రభుత్వం రూ.200కోట్ల నిధులు మంజూరు చేసింది. ఇందులో భాగంగా ఈ నెల 25వ తేదీన జీవో ఎంఎస్ 747ను విడుదల చేసింది. నగరంలో వేసవిలో సైతం తాగునీటి సమస్య రాకుండా ఉండేందుకు.. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పాలేరు, మున్నేరు నుంచి తాగునీటిని వినియోగిస్తున్న విషయం తెలిసిందే. కార్పొరేషన్‌లో జనాభా పెరుగుదలతో పాటు కొత్తగా ఏర్పడుతున్న శివారు కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు అధికమయ్యాయి. అదే సమయంలో ఉమ్మడి జిల్లాతో పాటు సరిహద్దు మహబూబాబాద్, సూర్యాపేట, కృష్ణా జిల్లాల నుంచి కూడా ఎక్కువ మంది ఖమ్మంలో విద్య, వైద్య, పలు వ్యాపారాల నిమిత్తం స్థిరపడుతున్నారు. దీంతో నగర జనాభా ప్రతీ ఏటా పెరుగుతోంది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఇటు మున్నేరు, పాలేరు నుంచి నీటి సరఫరా ద్వారా తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవ తీసుకుని రూ.200కోట్లతో ప్రతిపాదనలు చేయించారు. ప్రస్తుతం ఖమ్మం నగరంలో తాగునీటికి గతంలో కూడా ఎమ్మెల్యేగా, మంత్రిగా తుమ్మల నాగేశ్వరరావు దానవాయిగూడెం ఫిల్టర్ బెడ్ ద్వారా లకారం ట్యాంక్ నుంచి నగరానికి నీటి సరఫరాకు చర్యలు తీసుకున్నారు. అయితే ప్రస్తుతం ఉన్న నీటి సరఫరా నగర ప్రజలకు సరిపోవడం లేదు. కొత్త పైపులైన్లు, ఫిల్టర్ బెడ్లు, పంపుహౌజ్‌లు శివారు కాలనీలకు ఇంటింటికీ తాగునీటి అందించేందుకు నిధుల అవసరం ఏర్పడింది. రాబోయే దశాబ్దన్నర కాలంలో ఖమ్మం నగర అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని మంత్రి తుమ్మల ఇంటింటికీ నీటిని సరఫరా చేసేందుకు ప్రతిపాదనలు చేయించారు. ఇందుకోసం సుమారు రూ.200కోట్లు అవసరం ఉండడంతో.. ఆ నిధులు మంజూరు చేయించినట్టు మంత్రి తుమ్మల క్యాంపు కార్యాలయం సోమవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. జీవో 747 ద్వారా ఖమ్మంకు రూ.200కోట్లు కేటాయిస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. ఈ నిధుల ద్వారా ఖమ్మం ప్రజలకు ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా ప్రతీ ఇంటికి తాగునీటిని అందించడం జరగనుంది. నగరానికి తాగునీటి అవసరాలు తీర్చేందుకు నిధులు మంజూరు చేసినందుకు ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజతో పాటు పాలకవర్గం మంత్రి తుమ్మలకు కృతజ్ఞతలు తెలిపారు.

లక్ష్యంలో రికార్డు

- అశ్వారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీ చరిత్రలో మొదటిసారిగా అత్యధిక గెలల క్రషింగ్
- ఆయిల్ ఇయర్ పూర్తికి నాలుగు రోజులు ముందుగానే.. 6

రైతుల్లో 'మొంథా' భయం



- పంటలు చేతికొచ్చే వేళ పొంచిఉన్న తుఫాన్ ముప్పు
- భారీ వర్షాలు పడితే అంతా ఆగమాగమేనని అన్నదాతల్లో ఆందోళన 6
- కమ్ముకొస్తున్న మబ్బులతో బిక్కుబిక్కుమంటున్న వైనం

పంట నష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

కలెక్టర్లతో వీసీలో మంత్రులు తుమ్మల, ఉత్తమ్

సిండికేట్‌కే కిక్కు.. కొందరికే లక్కు

- మద్యం దుకాణాల డ్రా పూర్తి
- మూడు గంటల పాటు సాగిన ప్రక్రియ
- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సమక్షంలో ఎంపిక
- 12 దుకాణాలు దక్కించుకున్న ఏపీ వ్యాపారులు
- మరో పది మంది పాతవారికి మళ్లీ లక్కు



లక్కీడ్రా తీస్తున్న కలెక్టర్ అనుదీప్, ఎక్సైజ్ అధికారులు

ఖమ్మం సంక్షేమ విభాగం, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): 2023లో నిర్వహించిన మద్యం లాటరీలో సిండికేట్ వ్యాపారులకు ముచ్చమటలు పట్టాయి. కానీ 2025లో మాత్రం అందుకు విరుద్ధంగా జరిగింది. షాప్ నెంబర్ 1 నుంచి డ్రా ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి సిండికేట్ వ్యాపారులకు కిక్కు వస్తూనే ఉంది. 2023లో షాప్ నెంబర్ 1ను దక్కించుకొని వ్యాపారం చేస్తున్న వ్యక్తికే యథావిధిగా తిరిగి లాటరీ దక్కింది. ఆదే కొనసాగింపుగా మూడు గంటల పాటు జరిగిన మద్యం లాటరీలో సిండికేట్ వ్యాపారులకు కిక్కు ఇవ్వగా కొత్త వారికి కొందరికే లక్కు కలిగింది. కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సమక్షంలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగేంద్రరెడ్డి ఆధ్వర్యంలో మూడు గంటల పాటు ప్రశాంతంగా లాటరీ ప్రక్రియను ముగించారు.

సిండికేట్‌కు కలిసొచ్చింది..

జిల్లాలోని ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌ల పరిధిలో 116 మద్యం దుకాణాలకు సోమవారం ఖమ్మంలోని సీక్వేల్ రిసార్ట్స్‌లో లాటరీ ప్రక్రియ నిర్వహించారు. ఖమ్మం 1 స్టేషన్ పరిధిలోని 27మద్యం దుకాణాలకు 1,241 దరఖాస్తులు, ఖమ్మం 2స్టేషన్‌లో 18 దుకాణాలకు 710, నేలకొండపల్లి స్టేషన్ పరిధిలోని 15 మద్యం దుకాణాలకు 468, వైరాలో 13దుకాణాలకు 470, మధిర స్టేషన్ పరిధిలో 14దుకాణాలకు 464, 19 దుకాణాలకు 791, సింగరేణిలో 10 మద్యం

(మిగతా 6వ పేజీలో)



కార్తీక మాసం.. తొలి సోమవారం

శివయ్య ప్రీతికరమైన కార్తీకమాసం తొలిసోమవారం రోజున జిల్లాలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. తెల్లవారుజామునే భక్తులు దీపాలు వెలిగించగా ఆ వెలుగుల్లో దేవాలయాలు శోభాయమానంగా మెరిసిపోయాయి.

ఖమ్మం గుంటు మల్లన్న ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

రైతుల్లో 'మొంథా' భయం

పంటలు చేతికొచ్చే వేళ
పొంచి ఉన్న తుఫాన్ ముప్పు
భారీ వర్షాలు పడితే అంతా
ఆగమాగమేనని అన్నదాతల్లో ఆందోళన
కమ్ముకొస్తున్న మబ్బులతో
బిక్కుబిక్కుమంటున్న వైనం

ఖమ్మం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడనం.. వాయుగుండగా మారిన నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పడిన తుఫాన్ పరిస్థితులు ఉమ్మడి జిల్లా వాసులనూ భయపెడుతున్నాయి. ఆ తుఫాన్‌కు మొంథా అని నామకరణం చేయగా.. దాని ప్రభావం జిల్లాపైనా ఉంటుందన్న సంకేతాలతో రైతులు బిక్కుబిక్కుమంటున్నారు. దీపావళి తర్వాత వరికోతలు ప్రారంభించగా.. ఈ తుఫాన్ హెచ్చరికలతో కోతలు కొనసాగించలేని పరిస్థితిలో ఉన్నారు. ఈ సమయంలో భారీ వర్షాలు పడితే భారీ నష్టం వాటిల్లుతుందని, చేతికొచ్చిన పంటలు నీటిపాలయ్యే ప్రమాదం ఉందని ఆవేదన చెందుతున్నారు. ఉమ్మడిజిల్లాలో సుమారు 3.50లక్షల ఎకరాలకు పైగా పత్తి, 5లక్షల ఎకరాలపైగా వరి, 50వేల ఎకరాల్లో మిర్చి సాగవుతుంది. అలాగే మొక్కజొన్న, తదితర పంటలను కూడా వేశారు. ఏపీకి సరిహద్దున్న ఉన్న సత్తుపల్లి, అశ్వారావుపేట, మధిర నియోజకవర్గాల్లో పత్తి, వరి పంటలు చేతికొస్తున్నాయి. తుఫాన్ తాకిడికి చేలోని పంట చేలోనే నేలవాలే పరిస్థితి ఉంది. దీంతో రైతులు వర్షానికి భయపడి పత్తి పంటను త్వరగా తీసేందుకు పరుగులు పెడుతున్నారు. అలాగే ఇప్పటికే మొదటి విడతలోనే అడపా దడపా కురిసిన వర్షాలకు పత్తి నాణ్యత, దిగుబడి తగ్గి రైతులు నష్టపోయారు. ప్రైవేటుగా పత్తిక్వింటాకు రూ.6వేల నుంచి రూ.7వేలు ధర పలుకుతున్నా తేమశాతం అధికంగా ఉండడం, నల్లబడడంతో ఆశించిన ధర దక్కలేదు. మళ్లీ రెండో విడత పత్తి తీసే సమయంలోనూ వర్షాలు పడితే దారుణంగా నష్టపోతామని రైతులు బిక్కుబిక్కుమంటున్నారు. ఇక ఈ ఏడాది ఇప్పటి వరకు వరిసాగు ఆశాజనకంగా ఉన్నా సాగర్ ఆయకట్టు కింద కోతల దశలో తుఫాన్ విజృంభిస్తే వరిపంట నేలపాలయ్యే పరిస్థితి ఉంది. సత్తుపల్లి ప్రాంతంలో వరికోతలు ప్రారంభమయ్యాయి. ధాన్యం కొనుగోలు కేంద్రాలు కూడా ప్రారంభమయ్యాయి. మిర్చిపంటకూడా ప్రస్తుతం పూత, కాత దశలో ఉంది. ఇప్పుడు వర్షాలు పడితే తెగుళ్ల సోకే అవకాశం ఉందని రైతులు ఆవేదన చెందుతున్నారు. మొక్కజొన్న తదితరపంటలకు కూడా నష్టంజరిగే పరిస్థితులన్నాయి.



కాంటా వేసిన ధాన్యం బస్తాలను లారీల్లో ఎగుమతి చేస్తున్న ప్రైవేటు వ్యాపారులు

పచ్చి ధాన్యాన్నే అమ్ముకుంటున్నారు..

రైతులను భయపెడుతున్న 'మొంథా'

కల్లూరు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ భయంతో కల్లూరు మండలంలోని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆరుగాలం కష్టపడి పంట చేతికి వస్తున్న సమయంలో వచ్చిన ఈ తుఫాన్ గండం నుంచి గట్టెక్కేందుకు ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నారు. కొద్ది రోజుల క్రితం నుంచే పలు గ్రామాల్లో యంత్రాలతో వరి కోతలు చేస్తుండగా.. పంట ఆరబెడితే తుఫాన్ ప్రభావంతో వచ్చే వానలకు తడిచి ధర రాదన్న భయంతో గత్యంతరం లేక పచ్చి ధాన్యాన్నే ప్రైవేట్ వ్యాపారులకు వారిచ్చిన ధరకు అమ్ముకుంటున్న పరిస్థితి కనిపిస్తోంది. కల్లూరు మండలంలో సుమారు 40వేల ఎకరాల్లో వరి పైరు సాగవగా.. దారుగాబంజర, చెన్నూరు, లింగాల, ఎర్రబోయనపల్లి, చంద్రుపట్ల, వాచ్యా నాయక్‌తండ, బోడేమల్లి తదితర గ్రామాల్లోని రైతులు ఎక్కువ శాతం పచ్చిధాన్యాన్ని కల్లాలోనే అమ్ముకుంటున్నారు. తుఫాన్ గండంతో పంటను ఆరబెట్టి కొనుగోలు కేంద్రాల్లో అమ్మే సమయం లేక ప్రభుత్వ మద్దతు ధర, బోనస్‌ను కూడా కోల్పోవాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ధర ఏగ్రేడ్ రకం సన్నాలకు ప్రభుత్వం ఒక క్వింటాకు మద్దతు ధరగా రూ.2389, బి గ్రేడ్ రకం రూ.2369 ఉండగా.. పచ్చిధాన్యం క్వింటా ధర రూ.1800 నుంచి రూ.1900 వరకు ప్రైవేట్ వ్యాపారులు కొంటున్నారు. ఈ క్రమంలో బస్తాకు రూ. 500 వరకు నష్టపోవాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు.

పంట నష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

ధాన్యం కొనుగోలు కేంద్రాలను
వెంటనే ప్రారంభించాలి
కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో
మంత్రులు తుమ్మల, ఉత్తమ్
తుఫాన్ నేపథ్యంలో కోతలు వాయిదా
వేసుకోవాలని రైతులకు సూచన



వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ అనుదీప్, అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

ఖమ్మం కలెక్టరేట్/ కొత్తగూడెం కలెక్టరేట్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో పడే వర్షాలకు పంట నష్టం వాటిల్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, రైతులను అప్రమత్తం చేయాలని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్‌రెడ్డి యంత్రాంగానికి సూచించారు. వారు సోమవారం హైదరాబాద్ నుంచి పత్తి, ధాన్యం, మొక్కజొన్న తదితర పంటల కొనుగోలుపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో సమావేశంలో కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్‌లో ఖమ్మం నుంచి కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, భద్రాద్రి జిల్లా కేంద్రం నుంచి కలెక్టర్ జితేష్ విపాటిల్, తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రులు మాట్లాడుతూ రాబోయే రెండురోజుల పాటు తుఫాన్ ప్రభావంతో రాష్ట్రంలో వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. వరి, పత్తి, మొక్కజొన్న పంట కొనుగోలు కేంద్రాల వద్ద వర్షాల కారణంగా ఎలాంటి నష్టం వాటిల్లకుండా జాగ్రత్తలు పాటిస్తూ చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈక్రమంలో రైతులను అప్రమత్తం చేసి పంట కోతలు వాయిదా వేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. కోతలు చేసిన మొక్కజొన్న, వరి వంటి పంటలు నాణ్యతా ప్రమాణాలు ఉంటే వెంటనే కాంటా వేసి కొనుగోలు చేయాలని, పంట తరలింపునకు వాహనాల సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మార్కెట్ కు చేరిన పంట అకాల వర్షాలకు తడవకుండా చర్యలు తీసుకోవాలని, అవసరమైన మేర టార్పాలిన్ కవర్లు సిద్ధం చేయాలని అన్నారు. వ్యవసాయ విస్తరణ అధికారుల ద్వారా రైతుల కల్లాల వద్ద తేమ శాతం పరిశీలించి నాణ్యత ప్రమాణాలు ఉంటేనే కొనుగోలు కేంద్రాలకు పంట తీసుకొచ్చేలా చూడాలన్నారు. ఈ వీడియోకాన్ఫరెన్స్ అనంతరం ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సంబంధిత జిల్లా అధికారులతో మాట్లాడుతూ వానాకాలం పంట కోతలు ప్రారంభమై ధాన్యం కొనుగోలు చేస్తున్న నేపథ్యంలో రైస్ మిల్లర్ల దగ్గరనుంచి బ్యాంకు గ్యారంటీని సేకరించాలని ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం బ్యాంకు గ్యారంటీలు లేకుండా ధాన్యం అలాట్మెంట్ చేయొద్దన్నారు. ఖమ్మం జిల్లాలో నవంబర్ 1 నాటికి పంట కొనుగోలు కేంద్రాలను వంద శాతం ప్రారంభించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్డీవో సన్యాసయ్య, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి చందన్ కుమార్, జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ శ్రీలత, జిల్లా వ్యవసాయశాఖ అధికారి డి. పుల్లయ్య, జిల్లా మార్కెటింగ్ అధికారి అలీమ్, ఆర్డీవో వెంకటరమణ, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ సునీత తదితరులు పాల్గొన్నారు.

'మొంథా' దృష్ట్యా రైతులు అప్రమత్తంగా ఉండాలి

మూడు రోజుల పాటు పంట కోత ఆపాలి : ఖమ్మం కలెక్టర్ అనుదీప్

ఖమ్మం కలెక్టరేట్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి కోరారు. రానున్న రెండు, మూడు రోజుల పాటు పంట కోతలు చేయవద్దని ఆయన రైతులను కోరారు. ఖమ్మం జిల్లాలోనూ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, పంట నష్టం వాటిల్లకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన రైతులకు సూచించారు.

విధుల్లో చేరిన ఐదుగురు ఎంపీడీవోలు



అదనపు కలెక్టర్ శ్రీజను కలిసి రిపోర్టు చేస్తున్న ఎంపీడీవోలు

ఖమ్మం కలెక్టరేట్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాకు కేటాయించిన ఆరుగురు ఎంపీడీవోల్లో ఐదుగురు సోమవారం విధుల్లో చేరారు. జిల్లాకు కేటాయించిన ఎంపీడీవోలు కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ శ్రీజను కలిసి రిపోర్టు చేశారు. ఈ సందర్భంగా వారిని ఆమె అభినందించారు. అనంతరం జడ్పీ డిప్యూటీ సీఈవో నాగపద్మజను ఎంపీడీవోలు కలిసారు.కూసుమంచికి టి.జశ్వంత్, ఏన్కూరుకు పి.భాగ్యశ్రీ, కొణిజర్లకు జీ.వర్ష, వేంసూరుకు డి.కావ్య, తల్లాడకు డి.సోనియా, ఖమ్మం రూరల్ మండలానికి కె.రవికుమార్‌ను కేటాయించారు. వారంతా రేపు విధుల్లో చేరనున్నారు. రవికుమార్ అనే వ్యక్తి రిపోర్టు చేయాల్సి ఉంది.

రేషన్ బియ్యం పట్టివేత

చింతకాని, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పందిళ్లపల్లి సమీపంలో ఓ వ్యానులో తరలిస్తున్న 76 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు సోమవారం పట్టుకున్నారు. వ్యాన్‌ను సీజ్ చేయడంతోపాటు డ్రైవరును అదుపులోకి తీసుకున్నారు. లబ్ధిదారుల నుంచి బియ్యాన్ని సేకరించి ఖమ్మానికి తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఎస్‌ఐ వీరేందర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

చింతకాని, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నాగిలిగొండ గ్రామానికి చెందిన పంది సీతమ్మ (55) అను మహిళ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సీతమ్మ భర్త సుమారు 10ఏళ్ల క్రితం మృతి చెందడంతో కుమారుడు నరేష్ వద్ద ఉంటుంది. ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న సీతమ్మ మనస్థాపంతో ఈనెల 19వ తేదీన పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం 24వ తేదీన హైదరాబాద్ తరలించారు. అనంతరం 26వ తేదీన తిరిగి ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా చికిత్స పొందుతూ మృతిచెందింది. కుమారుడు నరేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ వీరేందర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కారు ఢీకొని వృద్ధుడి దుర్మరణం



శేషయ్య (ఫైల్)

తిరుమలాయపాలెం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కారు ఢీకొని వృద్ధుడు మృతి చెందిన ఘటన సోమవారం మండలంలోని పిండిప్రోలులో జరిగింది గ్రామానికి చెందిన గోకినపల్లి శేషయ్య (70) అనే వృద్ధుడు పించన్ కోసం గ్రామంలోని ఐవోబీ బ్యాంకు వద్దకు వెళ్లాడు. పించన్ తీసుకున్న అనంతరం శేషయ్య ఇంటికి రోడ్డు దాటుతుండగా వరంగల్ నుంచి ఖమ్మంవైపు వెళుతున్న కారు ఢీకొట్టింది. దీంతో శేషయ్య తలకు తీవ్రగాయం కావడంతో వైద్య చికిత్స కోసం తిరుమలాయపాలెంలోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే శేషయ్య మృతిచెందినట్టు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుమారుడు శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

చెల్లని చెక్కు కేసులో ఆరు నెలల జైలు

ఖమ్మంలీగల్, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): ఖమ్మంలోని మారుతి నగర్ ప్రాంతానికి చెందిన గద్దల బాబుకు చెల్లనిచెక్కు కేసులో ఆరు నెలలుజైలు శిక్షతోపాటు ఫిర్యాదికి రెండు లక్షల రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని ఖమ్మం పిసిసిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయాధికారి కాసరగడ్డ దీప సోమవారం తీర్పు చెప్పారు. మధిర మండలం ఇల్లందులపాడు గ్రామానికి చెందిన ఫిర్యాది తాళ్లూరి వెంకటరత్నం వద్ద నిందితుడు2017లో రూ.4లక్షలు అప్పుగా తీసుకున్నాడు. 2020లో ఆరు లక్షలయాభై వేల రూపాయలకు చెక్కు జారీ చేశాడు. ఫిర్యాది బ్యాంక్ ఖాతాలో జమ చేయగా, వారు మెమో జారీ చేశారు. ఫిర్యాది లీగల్ నోటీస్ జారీ చేశాడు. కోర్టులో ప్రైవేటు కేసు దాఖలు చేశాడు. కేసులోని సాక్షులను విచారించిన న్యాయాధికారి నేరం రుజువుకావడంతో పైవిధంగా తీర్పు చెప్పారు.

మరొకరికి ఆరు నెలలు..

ఖమ్మంరూరల్ మండలం సప్తగిరి నగర్ ప్రాంతానికి చెందిన తెనాలి ఆంజనేయ ప్రసాద్‌కు చెల్లనిచెక్కు కేసులో ఆరు నెలలుజైలు శిక్ష తోపాటు ఫిర్యాదికి పదిహేను లక్షల రూపాయలు చెల్లించాలని న్యాయాధికారి కాసరగడ్డ దీప సోమవారం తీర్పు చెప్పారు. ఖమ్మం పట్టణం లోని బుర్హాన్‌పురం ప్రాంతానికి చెందిన ఫిర్యాది పసుపులేటి వేంకటశ్వర్లు వద్ద నిందితుడు రూ.15లక్షలు 2018లో అప్పుగా తీసుకున్నాడు. కాగా 2019లో రూ.17లక్షలకు చెక్కు జారీ చేశాడు. ఫిర్యాది తన బ్యాంక్ ఖాతాలో జమ చేయగా నిందితుడి బ్యాంకు వారు డ్రాయర్స్ సిగ్నేచర్ డిపర్స్ అని మెమో ఇచ్చారు. కోర్టులో ప్రైవేటు కేసు దాఖలు చేశారు. కేసులోని సాక్షాలను విచారించిన న్యాయాధికారి నేరం రుజువుకావడంతో తీర్పు చెప్పారు.

కల్లూరు డిప్యూటీ డీఎంహెచ్‌వో సరెండర్

ఖమ్మం కలెక్టరేట్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కల్లూరు డిప్యూటీ డీఎంహెచ్‌వో సీతారాములను సోమవారం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఉత్తర్వులు జారీ చేశారు. సీతారాములు జిల్లా అధికారులు నిర్వహించే సమీక్ష సమావేశాలకు హాజరు కాకపోవడాన్ని తీవ్రంగా పరిగణించారు. దీనితో పాటు కల్లూరు డివిజన్‌లో గర్భిణుల నమోదు, కాన్పుల తీరు మెరుగుపడక పోవడంతో పాటు ఆయన పనితీరు మార్చుకోక పోవడంతో డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌కు సరెండర్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయమైన జిల్లా వైద్యాధికారి కలెక్టర్ ఉత్తర్వులను హైదరాబాద్‌కు పంపించనున్నట్లు తెలిపారు.

బ్యాటరీల దొంగల అరెస్ట్

ఖమ్మం క్రైం,అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): వాహనాల బ్యాటరీలు చోరీ చేస్తున్న ముగ్గురు యువకులను ఖానాపురం హవేలీ పోలీసులు సోమవారం సాయంత్రం అదుపులోకి తీసుకున్నారు. ఖమ్మం రూరల్ మండలం, నాయుడుపేటకు చెందిన గూడెల్లి సాయి, పెంద్ర సాయి, గూడుల్లి అభి కొంతకాలంగా జల్సాలకు అలవాటు పడ్డారు. ఖాళీ స్థలంలో నిలిపి ఉన్న ట్రాక్టర్ల బ్యాటరీలు చోరీ చేస్తున్నారు. సోమవారం సాయంత్రం ఆటోలో వీరు ముగ్గురు బ్యాటరీలు తీసుకుని వెళుతుండగా చెరుకూరి గార్డెన్స్ సమీపంలో ఖానాపురం హవేలీ పోలీసులకు అనుమానస్పదంగా కనిపించారు. దీంతో వారిని అదుపులోకి తీసుకుని విచారణ జరిపారు. పలు చోట్ల దొంగతనాలకు పాల్పడినట్టు ఒప్పుకున్నారు. వారి వద్ద నుంచి 12బ్యాటరీలు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమెదు చేశారు.

టీటీలో సిరికి బంగారు పతకం



బోనకల్,అక్టోబరు27(ఆంధ్రజ్యోతి):ఈనెల24,25వతేదీల్లో హైదరాబాద్‌లో జరిగిన టేబుల్ టెన్నిస్ రాష్ట్రస్థాయి టోర్నమెంట్లో మండలంలోని జానకీపురం గ్రామానికి చెందిన గద్దల సిరిబంగారు పతకం సాధించారు. ప్రస్తుతం సిరి ఖమ్మం సాహితీ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతుంది. టేబుల్ టెన్నిస్ పోటీల్లో అండర్-17 బాలికల విభాగంలో డబుల్స్‌లో గోల్డ్ మెడల్, సింగిల్స్‌లో రజత పతకం సాధించారు.

సిండికేట్‌కే కిక్కు.. కొందరికే లక్కు

(5వ పేజీ తరువాయి)

దుకాణాలకు 286 దరఖాస్తులు.. మొత్తం 4,430 దరఖాస్తులు వచ్చాయి. వీడియో రికార్డింగ్‌లో దుకాణాల వారీగా లాటరీ తీసిన అధికారులు నోటిఫికేషన్ నిబంధనల ప్రకారం గౌడ కులస్తులకు 18, ఎస్సీ 14, ఎస్టీ 8 దుకాణాలకు రిజర్వేషన్లు అమలు చేశారు. మరో 76షాపులకు ఓపెన్‌గ్యాలరీలో లైసెన్స్‌లు మంజూరు విధానం నిర్వహించారు. స్వయంగా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి 116 మద్యం దుకాణాలకు లాటరీని తీశారు. కాగా తొలి లాటరీ నుంచి చివరి వరకు ఉత్సాహ వాతావరణం కనిపించింది. 700 దరఖాస్తులు చేసిన బడా సిండికేట్‌కు 19మద్యం దుకాణాలు దక్కాయి. మరో సిండికేట్‌కు 2, 3, 2, 1 చొప్పున మొత్తం 8 మద్యం దుకాణాలు వచ్చాయి. అలాగే బల్లేపల్లి యూత్ కూడా వైన్స్ దక్కాయి. ఇలా సిండికేట్‌లకు లక్కు కిక్కుగా మారింది. 3వ షాపును ఓ ఆర్‌ఎంపీ వైద్యుడు దక్కించుకున్నారు. ఏపీ వ్యాపారులకు కూడా మధిర, సత్తుపల్లి ప్రాంతంతో పాటుగా ఖమ్మంలో మొత్తం 12 మద్యం దుకాణాలు దక్కాయి. కొత్తగా సిండికేట్‌గా మారిన వారిలో యువతి, యువకులు కూడా ఉన్నారు. ఇప్పుడు లాటరీలో మద్యం దుకాణాలు దక్కించుకున్న వారికి డిసెంబరు 1 నుంచి మద్యం వ్యాపారానికి లైసెన్స్‌లు జారీ జరుగుతాయి.



డ్రాలో షాపు దక్కించుకున్న వ్యాపారి

ఉత్సాహంగా జరిగిన లాటరీ

గత మద్యం నోటిపికేషన్‌లో నగరానికి చెందిన ఓ మద్యం వ్యాపారికి దుకాణం దక్కలేదు. వ్యాపారాన్ని వోదులుకోలేక ముస్తాపనగర్‌లో ఓ షాపును గుడ్‌విల్‌కు తీసుకొని వ్యాపారం చేశారు. ఇప్పుడు లాటరీలో దుకాణం రావటంతో సంతోషం అపుకోలేక తనకు తానే జై కొట్టుకున్నారు. ఇలా సిండికేట్‌లోని చాలా మందికి వారు ఊహించిన దానికంటే ఎక్కువ దుకాణాలు రావటంతో లాటరీ ప్రాంతం ఉత్సహంగా కనిపించింది. కానీ ఒక్కో దరఖాస్తుకు రూ.3లక్షలు వ్యయం చేసి లాటరీలో దుకాణాలు రాని వారు మాత్రం తీవ్ర నిరాశతో వెనుదిరిగారు. అసిస్టెంట్ ఎక్షైజ్ సూపరింటెండెంట్ వేణుగోపాల్‌రెడ్డి, ఖమ్మం 1 టౌన్, 2టౌన్, వైరా, కొండపల్లి, సత్తుపల్లి, సింగరేణి, మదిర సీఐలు బీ కృష్ణ, చంద్రమోహన్, మమతారెడ్డి, ఎస్ రమేశ్, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, జే.రాంమూర్తి సిబ్బందితో పాల్గొన్నారు.

ఆ దంపతులు.. జాక్ పాట్ కొట్టారు

లాటరీలో దక్కిన మూడు వైన్ షాపులు

వైరా, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): వైన్‌షాపుల డ్రాలో వైరాకు చెందిన దంపతులు జాక్‌పాట్ కొట్టారు. సోమవారం ఖమ్మంలో నిర్వహించిన డ్రాలో వైరాకు చెందిన పంది నరేష్, మానస దంపతులకు మూడు వైన్ షాపులు దక్కాకు. నరేష్‌కు వైరాలోనే వైన్ షాప్ 62 సింగిల్‌గా రాగా.. సిండికేట్‌లో నరేష్ భార్య మానస పేరిట ఏపీ సరిహద్దుల్లోని దాచాపురం వైన్ షాప్ నెంబర్ 72, కొణిజర్లలోని 65వ నెంబర్ షాపు వచ్చాయి.

'ఛాంబర్' ఎన్నికల నామినేషన్లు షురూ

ఖమ్మంమార్కెట్, అక్టోబరు77(ఆంధ్రజ్యోతి): నవంబరు 16న జరుగనున్న 'ఛాంబర్ ఆఫ్ కామర్స్' ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ సోమవారం మొదలైంది. మొదటిరోజు వర్తకసంఘ భవన్‌లో మొత్తం 37మంది నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారి అడ్వకేట్ పీబీ.శ్రీరాములుకు అందచేశారు. మంగళవారం వరకు నామినేషన్ల స్వీకరణ, ఈనెల30న నామినేషన్ల పరిశీలన, 31న ఉపసంహరణ ఉంటాయని చెప్పారు. నవంబరు16న ఉదయం నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు ఎన్నికల నిర్వహణ, సాయంత్రం 5గంటల నుంచి ఓట్ల లెక్కింపు అనంతరం ఫలితాలు తెలపనున్నారు. ఎన్నికల్లో 18శాఖల నుంచి 1305 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. కార్యక్రమంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చిన్ని క్రిష్ణారావు, సెక్రెటరీ మెంతుల శ్రీశైలం ఉపాధ్యక్షుడు సోమా నర్సింహరావు, సహాయ కార్యదర్శి మన్నెం క్రిష్ణ, ట్రెజరర్ తల్లాడ రమేష్ తదితరులు ఉన్నారు.



నామినేషన్ పత్రాలు అందజేస్తున్న అభ్యర్థి

కలెక్టరేట్ ఎదుట పెన్షనర్ల ధర్నా

ఖమ్మంకలెక్టరేట్,అక్టోబరు27(ఆంధ్రజ్యోతి):పెన్షనర్ల బకాయిలను ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని పెన్షనర్ల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోవారం ఎస్‌జీపీఏటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నాచౌక్‌లో ఆందోళన నిర్వహించారు. రాష్ట్రప్రభుత్వం పెన్షనర్ల పట్ల వివక్షపూరితంగా వ్యవహరిస్తోందన్నారు. జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో పెన్షనర్లు తరలి రాగా ధర్నాను ఎస్జీపీఏటి రాష్ట్ర కార్యదర్శి వి.మేరీ ఏసుపాదం నిరసనను ప్రారంభించారు. అనంతరం కలెక్టరేట్లో డీఆర్వో పద్మశ్రీకి వినతి పత్రం అందజేశారు. ఈధర్నాలో సీపీఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు, టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.విజయ్, మాజీ ప్రధాన కార్యదర్శి వి. మనోహర్రాజు, ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కరీం, టాప్రా జిల్లా ప్రధాన కార్యదర్శి కళ్యాణం నాగేశ్వరరావు, టీయూసీఐ రాష్ట్ర కార్యదర్శి ఆవుల అశోక్, విశ్రాంత అధ్యాపక సంఘ నాయకులు ఎ.విద్యాసాగర్, మార్కెట్ కమిటీ ఉద్యోగసంఘ నాయకులు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



లక్ష్యంలో రికార్డు

అశ్వారావుపేట, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి) : ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలో నడిచే అశ్వారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీ ఈ ఏడాది సరికొత్త చరిత్రకు శ్రీకా రం చుట్టింది. ఈ ఆయిల్ ఇయర్‌లో ఆయిల్ ఫెడ్ నిర్దేశించిన లక్ష టన్నుల పా మాయిల్ గెలల క్రషింగ్ (ఫ్రెష్ ఫ్రూట్ బంచెస్) లక్ష్యాన్ని అవలీలగా అధిగమించింది. పామాయిల్ చరిత్రలోనే అశ్వారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీ మొదటి సారిగా అత్యధిక గెలలు సాధించి అందరి ప్రశంసలను అందుకుంటోంది. పామాయిల్‌లో నవంబర్ 1వ తేదీ నుంచి అక్టోబరు 31వ తేదీ వరకు ఆయిల్ ఇయర్‌గా పరిగణిస్తారు. ఈ ఏడాది ఆయిల్ ఇయర్ మరో నాలుగురోజులు ఉందనగానే 26వ తేదీకి లక్ష టన్నుల గెలల క్రషింగ్ లక్ష్యాన్ని సాధించింది. 2006లో 5 టన్నుల సామర్థ్యంతో ప్రారంభమై 30 టన్నుల సామర్థ్యానికి పెరిగిన అశ్వారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీ పాత ఫ్యాక్టరీ. ప్రస్తుతం ఉన్న ఆధునిక టెక్నాలజీ ఈ ఫ్యాక్టరీలో పూర్తిగా అందుబాటులో లేదు. పాత ఫ్యాక్టరీలో తరుచూ అంతరాయాలు ఏర్పడుతున్నప్పటికీ.. దీనికి అనుబంధంగా గత ఏడాది ప్రారంభించిన పవర్ ప్లాంట్ సహాయంతో విద్యుత్‌లో అంతరాయాలు లేకుండా చూసుకుంటూ, వాటి మరమ్మతులను ఎప్పటికప్పుడు చేసుకుంటూ లక్ష టన్నులు క్రషింగ్ సాధించడం విశేషం.

అందరి సహకారంతో లక్ష్య సాధన
నాగబాబు, అశ్వారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీ మేనేజర్

ఈఆయిల్ ఇయర్‌లో లక్షటన్నులగెలల క్రషింగ్ చేయాలనే లక్ష్యాన్ని మరోనాలుగు రోజులుండగానే సాధించగలగటం సంతోషంగా ఉందని మేనేజర్ నాగబాబు అన్నారు. పవర్ ప్లాంట్ ఏర్పాటు, మరమ్మత్తులను ఎప్పటికపుడు పునరుద్ధరించుకోవడం ద్వారా, అందరి సహకారంతో ఇది సాధ్యమైందన్నారు. మొదటి సారిగా అశ్వారావుపేట ఫ్యాక్టరీ ఈఘనత సాధించడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేశారు.

ఆత్మకమిటీ ప్రమాణ స్వీకారం



ప్రమాణస్వీకారం చేస్తున్న మట్టూరి

వైరా,అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): వైరా నియోజకవర్గస్థాయి రైతు సలహా కమిటీ(ఆత్మ) చైర్మన్ మట్టూరి వెంకటేశ్వరరావు సహ కమిటీ సభ్యులు సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డులో ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ సమక్షంలో చైర్మన్ మట్టూరి వెంకటేశ్వరరావు, సభ్యులతో ఏడీఏ తుమ్మలపల్లి కరుణశ్రీ ప్రమాణ స్వీకారం చేయించారు. చైర్మన్‌గా వెంకటేశ్వరరావు, సభ్యులుగా జాలాది రామకృష్ణ, గడిపూడి రామకృష్ణ, అల్లాడి నర్సింహారావు, గుండ్ల జగన్నాథం, భూక్యా పద్మ, గోళ్ల సరస్వతీ, కోట దేవదత్తం, మల్లెంపాటి చంద్రరావు,అజ్మీరా బాలూనాయక్, దనసరి సుమలత, వాసిరెడ్డి సత్యనారాయణ, గుగులోతు రమణ, పిట్టల గోవిందమ్మ, గోడ విజయ, తలారి విజయకుమారి, కాంపల్లి రాజ్యలక్ష్మీ, వాసిరెడ్డి సత్యనారాయణ, సున్నం పగడయ్య, మరీదు నాగేశ్వరరావు, చింతనిప్పు జ్యోతి, లావుడ్య రాజ్‌కుమార్, బదావత్ భద్రు, సుల్తాన్ కొండలరావు, పోతుల నర్సింహారావు ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వం అందజేస్తున్న రైతు అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి విస్తృతంగా ప్రచారం చేసి అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, వైరా, ఏన్కూరు ఏఎంసీ చైర్మన్లు బోళ్ల గంగారావు, గుగులోతు లచ్చీరామ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, వైరా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకట నర్సిరెడ్డి, పగడాల మంజుల పాల్గొన్నారు.

ఖమ్మం కలెక్టరేట్ ఎదుట తెలంగాణ తల్లి విగ్రహం

ఖమ్మంకలెక్టరేట్, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): ఖమ్మంకలెక్టరేట్ ఆవరణంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ప్రత్యేకంగా వేదికను నిర్మిస్తున్నారు. ఐడీఓసీ సందర్శకులకు కనుల విందు చేసేలా తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. మూడు రోజుల్లో వేదికను సిద్ధం చేసి విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నట్లు తెలిసింది.

క్లీన్ ఖిల్లా..

200 మందితో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్
ఇక వారంలో ఒక రోజు 'క్లీన్ ఖమ్మం' కార్యక్రమం
37, 38, 39, 42 డివిజన్లలో స్పెషల్ డ్రైవ్
పాల్గొన్న మేయర్, కార్పొరేటర్లు, నాయకులు
ఉదయం నుంచి సాయంత్రం వరకు పనులు

ఖమ్మంకార్పొరేషన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధితో పాటు ఖమ్మం నగరంలో ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాలు, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచనల మేరకు పారిశుధ్యంపై 'స్పెషల్ డ్రైవ్' నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో భాగంగా పది రోజులుగా ప్రత్యేక పారిశుధ్య పనులు చేస్తున్నారు. సోమవారం ఖమ్మం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో 'క్లీన్ ఖిల్లా' నినాదంతో ఖిల్లా ప్రాంతంలోని నాలుగు డివిజన్లలో 120 మంది పారిశుధ్య కార్మికులు, రఘునాథపాలెం మండలం పరికలబోడుతండా నుంచి మరో 30 మంది కూలీలు, ఖమ్మం నగర మేయర్ పునుకొల్లు నీరజ, కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు కలిసి ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని మేయర్ పునుకొల్లు నీరజ చెట్ల కొమ్మలు నరికి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ వందల ఏళ్ల చరిత్ర కలిగిన ఖమ్మం ఖిల్లాకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో చేపట్టిన పనుల ద్వారానే మంచి పర్యాటక కేంద్రంగా గుర్తింపు వచ్చిందన్నారు. ఇప్పుడు ఖిల్లా పైకి రూప్ వే కార్యచరణ పూర్తి జరిగిందన్నారు. గతంలోను ఖిల్లాలో ప్రత్యేక పారిశుధ్య పనులు చేశామని, కానీ ఇప్పుడు చేపట్టిన ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా ఖిల్లా ప్రాంతంలోని 37, 38, 39, 42 డివిజన్లలో పారిశుధ్య పనులు జరిగాయని తెలిపారు. 120 మంది కార్మికులతో ప్రత్యేక గ్యాంగ్‌వర్క్ చేపట్టామన్నారు. ఇదే స్ఫూర్తితో వారంలో ఒక రోజు ఒక్కో ప్రాంతాన్ని క్లీన్ ఖమ్మం పేరుతో పారిశుధ్య పనులు చేపట్టేందుకు కార్యచరణ రూపొందిస్తున్నామన్నారు. సాధారణ సమయంలోనూ 20 మంది పారిశుధ్య కార్మికులతో పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఎటువంటి ప్రమాదాలు జరగకుండా, నివాసాలపై చెట్లు పడకుండా జాగ్రత్తగా పనులు చేపట్టాలని డీఆర్ఎఫ్ బలగాలకు, పారిశుధ్య కార్మికులకు సూచించామని తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు క్లీన్ ఖమ్మం పనులు చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ పాతిమా జోహరా, కార్పొరేటర్లు ఆలీయా, రఫీదాబేగం, కొత్తపల్లి నీరజ, రాపర్తి శరత్‌కుమార్, మలీదు వెంకటేశ్వర్లు, దుద్దుకూరి వెంకటేశ్వర్లు, మేడారపు వెంకటేశ్వర్లు, పగిడిపల్లి రోహిణి, మడూరి ప్రసాద్, శ్యామకూరి వెంకన్న, ఏఎంసీ చైర్మన్ యరగర్ల హనుమంతరావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, కాంగ్రెస్ నాయకులు తుమ్మల యుగంధర్, నాగండ్ల దీపక్‌చౌదరి, పాలేపు వెంకటరమణ పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న మేయర్, కార్పొరేటర్లు, నాయకులు


చెట్ల కొమ్మలు నరుకుతున్న నగర మేయర్ పునుకొల్లు నీరజ

కరకట్ట పరిసరాల శుభ్రత
అందరి బాధ్యత

ఐటీడీఏ పీవో రాహుల్, సబ్‌కలెక్టర్ మృణాల్‌శ్రేష్ఠ

భద్రాచలం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని కరకట్ట పరిసర ప్రాంతాలన్నీ శుభ్రంగా ఉండేలా చూడవలసిన బాధ్యత అధికారులు, స్వచ్ఛంద సంస్థలతో పాటు మనందరిపై ఉందని భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్, సబ్‌కలెక్టర్ మృణాల్‌శ్రేష్ఠ అన్నారు. సోమవారం గోదావరి ఒడ్డున కరకట్ట పరిసరాలను గ్రామ పంచాయతీ, స్థానిక డిగ్రీకళాశాల విద్యార్థులతో కలిసి పారిశుధ్య చర్యలు నిర్వహించే కార్యక్రమంలో పాల్గొనడంతో పాటు భక్తులకు మైక్ ద్వారా పీవో రాహుల్ ప్లాస్టిక్ నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భక్తులు స్నానాలు చేసిన తరువాత ప్లాస్టిక్ సంచులు కానీ, వ్యర్థ పదార్థాలు కానీ కరకట్ట ప్రదేశాల్లో వేయకూడదని, కరకట్ట పరిసరాల్లో చెత్తను వేయడంతో మంటలు చెలరేగి పరిసరాలన్నీ పొగ కమ్ముకుంటాయన్నారు. అలాగే పట్టణంలోని వార్డుల్లో సేకరించిన చెత్తను కొత్తగా నిర్మాణం చేపట్టిన డంపింగ్ యార్డులోనే వేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పట్టణ ప్రజలు గ్రామ పంచాయతీ సిబ్బందికి సహకరించి తడిచెత్త పొడిచెత్త వేర్వేరుగా పంచాయతీ ట్రాక్టర్లో మాత్రమే వేయాలని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎం అండ్‌హెచ్‌వో డాక్టర్ చైతన్య, తహసీల్దారు దనియాల వెంకటేశ్వర్లు, డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ జాన్‌మిల్టన్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.


భక్తులకు అవగాహన కల్పిస్తున్న పీవో

కాంగ్రెస్ హామీలు నెరవేర్చాలి

యువత రాజకీయాల్లోకి రావాలి
తెలంగాణ రాష్ట్రీయ లోక్‌దళ్‌పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్‌కుమార్

ఖమ్మం చర్చికాంపౌండ్/ అశ్వారావుపేట రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఇచ్చిన ఎన్నికల హామీలను వెంటనే నెరవేర్చాలని, యువత రాజకీయాల్లోకి వచ్చి రాష్ట్రాన్ని ఏలుకోవాలని తెలంగాణ రాష్ట్రీయ లోక్‌దళ్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్‌కుమార్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఎన్నికల హామీలను అమలుచేయాలని కోరుతూ ఆపార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన రథయాత్ర సోమవారం ఖమ్మం చేరుకుంది. ఈ సందర్భంగా ఖమ్మం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ కోసం పనిచేయని వారు నేడు మంత్రులుగా కమీషన్ల కోసం పని చేస్తున్నారని, వారిని వెంటనే భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో తెలంగాణ రాష్ట్రీయ లోక్‌దళ్‌పార్టీ అధికారప్రతినిధి గౌర బీరప్ప, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మోతుకూరి వెంకటాచారి, గంట్యాల నర సింహారావు, నూనె భాస్కరరావు, ఎస్‌కే జానిమహ్మద్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దిలీప్‌కుమార్

అశ్వారావుపేటలో...

ఆపార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన రథయాత్ర సోమవారం రాత్రి అశ్వారావుపేటకు చేరుకుంది. దారిలో సత్తుపల్లి రోడ్‌లో రథయాత్రను నిర్వహించి బస్టాండ్ సెంటర్‌లో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో కపిలవాయి దిలీప్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ పాలన బీఆర్ఎస్ పాలన కంటే అధ్వానంగా మారిందని అన్నారు. సింగరేణిలో జరుగుతున్న అక్రమాలపై కేంద్రం విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మడకం ప్రసాద్ దొర, వెలుగు జాకబ్, జానీ, సుధాకర్, వీరప్ప, నరసింహారావుతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

అవినీతిని ప్రారంభంలోనే అరికట్టాలి

సింగరేణి డైరెక్టర్లు సూర్యనారాయణ, తిరుమలరావు

కొత్తగూడెంటౌన్, అక్టోబరు27 (ఆంధ్రజ్యోతి): అవినీతి అక్రమాలను ప్రారంభదశలోనే నిర్మూలించాలని సింగరేణి డైరెక్టర్లు ఎల్‌వి.సూర్యనారాయణ, మోకాళ్ల తిరుమలరావు కోరారు. నిజాయితీ, నిబద్ధతతో విధులను నిర్వహించడం ద్వారా సింగరేణి సంస్థను అగ్రభాగాన నిలపాలన్నారు. సోమవారం సింగరేణి ప్రధాన కార్యాలయంలో విజిలెన్స్ అవగాహన వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్లు మాట్లాడుతూ అవినీతికి వ్యతిరేకంగా సమష్టి కృషి జరపాలని కోరారు. నిర్ధేశించిన విధులను నిజాయితీగా, పారదర్శకంగా అంకితభావంతో నిర్వహించాలని కోరారు. దేశం, రాష్ట్రం అభివృద్ధి పదంలో నడపాలంటే సమన్వయంతో పనిచేయాలన్నారు. సింగరేణి సంస్థలో పనిచేసే ఉద్యోగులు, కార్మికులంతా నిబద్ధతతో పనిచేయడం ద్వారా సంస్థను మరింత అభివృద్ధి పదంలో నడిపే అవకాశం ఉంటుందన్నారు. నిబంధనలకు అనుగుణంగా విధులను నిర్వహించాలని కోరారు. ఈ మేరకు అవినీతికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ జీఎం ప్రసాదరావు, అడిషనల్ మేనేజర్ విజిలెన్స్ జాకిర్ మోహినుద్దీన్, కార్మిక సంఘాల నాయకులు రమణమూర్తి, పీతాంబరం, వెంకటాచారి, జీఎంలు కవితానాయుడు, కిరణ్‌కుమార్, మురళీధర్, బెనడిక్ట్ నికోలస్ తదితరులు పాల్గొన్నారు.


విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో మాట్లాడుతున్న డైరెక్టర్లు

కొత్తగూడెం ఏరియాలో....

సింగరేణి కొత్తగూడెం ఏరియాలో విజిలెన్స్ అవగాహన వారోత్సవాలను జనరల్ మేనేజర్ షాలెంరాజు ప్రారంభించారు. ఈనెల 27 నుంచి నవంబర్ 2వ తేదీ వరకు సింగరేణి విజిలెన్స్ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థలో జవాబుదారీతనాన్ని పెంపొందించేందుకు ఈ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సింగరేణి యాజమాన్యం కార్మికుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని ఎటువంటి అవినీతికి తావులేకుండా పారదర్శకంగా పనులు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉమాయిన్, రజాక్, అధికారులు ఎస్‌ఓటూ జీఎం జీవీ కోటిరెడ్డి, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి టీటీ పోటీలకు జిల్లా క్రీడాకారులు

ఖమ్మం స్పోర్ట్స్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఈనెల 29నుంచి మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఇండోర్‌లో జరగనున్న జాతీయస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు క్రీడాకారులు ఎంపికైనారు. నిత్యం సర్దార్ పటేల్ స్టేడియంలో సాధనచేసే రెడ్డిసాయిశివ, పరిటాల జ్వలిత్, పిట్టల మోహిత్ క్రిష్ణ జాతీయ పోటీలకు ఎంపికైనట్లు జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ సెక్రటరీ, కోచ్ ఓలేటి సాంబమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను డీవైఎస్ఓ సునీల్‌రెడ్డి, జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలసాని ఆనంద్ తదితరులు అభినందించారు.


క్రీడాకారులను అభినందిస్తున్న డీవైఎస్ఓ సునీల్‌రెడ్డి, కోచ్ సాంబమూర్తి

2న ఎస్‌జీఎఫ్ క్రీడా ఎంపికలు

జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నవంబరు 2న జిల్లాలో పలు క్రీడా విభాగాలలో ఎంపికలు నిర్వహించనున్నట్లు ఎజీఎఫ్ జిల్లా సెక్రటరీ వై.రామారావు ఓ ప్రకటనలో తెలిపారు. ఖమ్మంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో అండర్-14 బాల, బాలికల షటిల్ బ్యాడ్మింటన్ జట్ల ఎంపికతో పాటు అండర్-17 కరాటే ఎంపికలు జరగనున్నాయి. అంతేకాకుండా నగరంలోని సెయింట్ జోసెఫ్ పాఠశాలలో అండర్-14 బాలురు, బాలికల బాస్కెట్ బాల్, సత్తుపల్లిలో అండర్-14 బాల, బాలికల కరాటే ఎంపికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు జనన ధ్రువపత్రం, ఆధార్, స్టడీ, ఫొటోతో సోమవారం ఉదయం 9 గంటల కల్లా వేదికల వద్దకు చేరుకోవాలని సూచించారు.

యువకుల అదృశ్యంపై కేసులు నమోదు

దుమ్ముగూడెం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతానగరానికి చెందిన కొమరం అఖండ్‌తేజ్(32) ఈనెల 23న అదృశ్యమయ్యాడు. అలాగే ఎం.కాశీనగరంకు చెందిన మరో యువకుడు మురకొండ నరేంద్రబాబు(31) 2025 జూలై 31న ఉద్యోగం వచ్చిందని ఇంట్లో చెప్పి హైదరాబాద్ వెళ్లాడు. ఈ క్రమంలో వారి కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదుతో అదృశ్యం కేసులు నమోదు చేశారు.

భవ్యశ్రీకి స్పాన్సర్‌ను ఏర్పాటు చేస్తాను

ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

అశ్వారావుపేట, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): అశ్వారావుపేటకు చెందిన భవ్యశ్రీలక్ష్మి ఇటీవలే రాష్ట్రస్థాయిలో గెలిచి నేషనల్ చెస్ చాంపియన్ పోటీలకు ఎంపికయ్యారు. భవ్యశ్రీ లక్ష్మి నేషనల్ చెస్ ఛాంపియన్ షిప్ పోటీలలో పాల్గొనేందుకు అవసరమైన స్పాన్సర్‌ను తాను ఏర్పాటు చేసి పెడతానని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. సోమవారం అశ్వారావుపేటలో భవ్యశ్రీ లక్ష్మి ఇంటి కి వెళ్ళి ఆమెను ఆమె తల్లి తండ్రులు సత్కరించారు. భవ్యశ్రీని అభినందిస్తూ రూ.5వేల నగదును ప్రోత్సాహకంగా అందజేసారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ స్పాన్సర్ చూసే బాధ్యత నాదని, భవిష్యత్‌లో మరెన్నో ఉన్నత శిఖరాలకు ఎదగాలని భవ్యశ్రీని అభినందించారు.


చెస్‌లో నేషనల్‌స్థాయికి ఎంపికైన భవ్యశ్రీ, ఆమె తల్లితండ్రులను సత్కరించిన ఎమ్మెల్యే జారే

సాగు భూమి రిజిస్ట్రేషన్‌కు.. రూ.60వేలు డిమాండ్

ఏసీబీకి చిక్కిన వేముకుంట గ్రామ పరిపాలనాధికారి
తొలుత రూ.40వేలు అప్పగించిన రైతు
మిగిలినవి ఇస్తేనే పని పూర్తవుతుందంటూ జీపీవో ఇబ్బందులు
రూ.15 వేలు తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు

ములకలపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : భూ భారతి యాప్ వచ్చిన అనంతరం రిజిస్ట్రేషన్ కోసం వెళ్లిన ఓ రైతు నుంచి గ్రామ పరిపాలనా అధికారి(జీపీవో) రూ.60వేలు లంచం డిమాండ్‌చేశాడు. ముందుగా రూ.40వేలు ఇచ్చినప్పటికీ పని చేసి పెట్టకపోగా.. మరో రూ.20వేలు చెల్లిస్తేనే పని పూర్తవుతుందని చెప్పాడు. చివరగా బేరమాడిన ఆ రైతుతో రూ.15వేలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఈ క్రమంలో ఆ రైతు నుంచి రూ.15వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలివీ.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలంలోని వేముకుంటకు చెందిన ఓ రైతు పూసుగూడెంలో వ్యవసాయ భూమి రిజిస్ట్రేషన్‌కు సంబంధించి ఈనెల 22న భూభారతిలో స్లాట్ బుక్ చేసుకున్నాడు. తీరా రిజిస్ట్రేషన్‌కు వెళ్లిన సమయంలో పూసుగూడెం జీపీవో శ్రీనివాస నాయక్ లంచం డిమాండ్ చేశాడు. రూ.60 వేలు ఇస్తేనే రిజిస్ట్రేషన్ అవుతుందని చెప్పాడు. తొలుత ఆ రైతు శ్రీనివాస్ నాయక్ నుంచి రూ.40వేలు తీసుకున్నాడు. అయినప్పటికీ పని చేయకుండా మిగిలిన రూ. 20వేలు నగదు ఇస్తేనే పని పూర్తవుతుందంటూ ఇబ్బందులు పెట్టి.. చివరకు రూ.15వేలు తీసుకునేందుకు అంగీకరించాడు. విసిగిపోయిన ఆ రైతు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారి పథకం ప్రకారం ఆ నగదును అందజేస్తుండగా.. ఏసీబీ డీఎస్పీ వై.రమేష్, ఆయన సిబ్బంది శ్రీనివాస్‌నాయక్‌ను పట్టుకున్నారు. పాల్వంచలోని శ్రీనివాస్ నివాసంలో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు.


శ్రీనివాస్‌నాయక్ (ఫైల్)

మాధారం చెరువులో చేపల మృత్యువాత

విష ప్రయోగం చేశారని పోలీసులకు ఫిర్యాదు

కారేపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం మాధారం పెద్దచెరువులో టన్నుల కొద్ది చేపలు మృత్యువాతపడ్డాయి. వాటి విలువ సుమారు రూ.10లక్షల వరకు ఉంటుందని చేపల చెరువు సొసైటీ సభ్యులు లబోదిబోమంటున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు విషప్రయోగం చేశారని ఆరోపిస్తు సోమవారం సొసైటీ అధ్యక్షుడు అజ్మీర సూక్యా నాయక్ ఆధ్వర్యంలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. రోజూ లాగానే అదివారం రాత్రి కూడా 11 గంటల వరకు సొసైటీ సభ్యులు చెరువువద్ద కాపలా ఉండి అనంతరం ఇంటికి వచ్చారు. సోమవారం ఉదయం చెరువు వద్దకు వెళ్లి చూడగా టన్నుల కొద్ది చేపలు మృతిచెంది నీటిపై తేలియాడుతూ ఉండటాన్ని చూసి నిర్ఘాంతపోయారు. దీంతో వెంటనే సొసైటీ అధ్యక్షుడు సూక్యా నాయక్ తెలపగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. పెద్ద మొత్తంలో చేపలు మృతిచెందడంతో సొసైటీలో 70 మంది సభ్యులు, ఆయా సభ్యుల కుటుంబాలు తీవ్రంగా నష్టపోయాయని పేర్కొన్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

కారు అదుపుతప్పి యువకుడి మృతి

పెనుబల్లి, అక్టోబర్ 27 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం, జగదల్‌పూర్ జాతీయ రహదారిపై పెనుబల్లి వద్ద కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టిన ఘటనలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరికి స్వల్ప గాయాలయిన ఘటన ఆదివారం అర్ధరాత్రి జరిగింది. తమిళనాడులోని కాంచీపురం జిల్లా తిరుకజహయకుండారం ప్రాంతానికి చెందిన బైబిల్ మిషన్ కాలేజి విద్యార్థులు ఒడిసా రాష్ట్రంలోని కోరాపుట్ నుంచి ఆదివారం మధ్యాహ్నం బయలుదేరి కాంచీపురం కారులో వెళుతుండగా పెనుబల్లి వద్ద అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టి పల్టీ కొట్టింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న అనీష్‌కుమార్ (27) ఘటనా స్థలంలోనే మృతి చెందగా ఎన్కిప్స్‌రాయ్ సన్ ఢానియేల్, అతని భార్య రేణుకారాణిలకు గాయాలయ్యాయి. అనీష్‌కుమార్ తండ్రి దురైపి ఫిర్యాదు మేరకు వి.యం.బంజర్ ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం

ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, మాలోతు రాందాస్ నాయక్

ఇల్లెందు, అక్టోబరు27 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమానికి వారు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ పేర్కొన్నారు. జిల్లాలో విస్తారంగా కురుస్తున్న వర్షాల మూలంగా పత్తి పంటలు తడిసిపోయాయని పత్తి రైతులను ఇబ్బందులకు గురిచేయకుండా కాటన్ కార్పొరేషన్ కొనుగోళ్లు చేయాలని కోరారు. సోమవారం ఇల్లెందు వ్యవసాయ మార్కెట్‌లో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యేలు కనకయ్య, రాందాస్ నాయక్‌లు మాట్లాడారు. సమావేశంలో ఇల్లెందు మార్కెట్ పరిధిలోని ఎనిమిది మండలాలకు చెందిన వ్యాపారులు పాల్గొన్నారు. అనంతరం ఆత్మకమిటీ బాధ్యతలు స్వీకరించింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కమిషన్ సభ్యుడు రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ ప్రథమ శ్రేణి కార్యదర్శి వి.సుచిత్ర, సెకండరీ గ్రేడ్ కార్యదర్శి ఇర్రి నరేష్, వ్యాపార ప్రముఖులు జుగల్ కిషోర్, మానాల వెంకన్న, వ్యామసాని జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

ఆయిల్‌పామ్ సాగు లాభదాయకం

భద్రాద్రి జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమ శాఖ అధికారి జంగ కిషోర్
పాయాయిల్ సాగు టార్గెట్‌ను పూర్తిచేయాలి

కొత్తగూడెం అర్బన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం పెంచాలని, నిర్ధేశించిన లక్ష్యానికి చేరుకోవాలని, అయిల్‌ఫామ్ సాగు అన్ని పంటల కన్నా లాభదాయకమని భద్రాద్రి జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమశాఖ అధికారి జంగ కిషోర్ అన్నారు. సోమవారం జిల్లా సొసైటీ కార్యాలయంలో డీసీవో ఎ.శ్రీనివాస్ అధ్యక్షతన ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖలో పనిచేస్తున్న ఆయిల్‌పామ్ అధికారులు, సిబ్బంది, పీఏసీఎస్ సీఈవోలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమానుద్దేశించి ఆయన మాట్లాడుతూ... ఆయిల్‌పామ్ సాగుపై ప్రభుత్వం అందిస్తున్న రాయితీ, బిందు సేద్యం వల్ల కలిగే లాభాలను వివరించారు. రైతులతో సమావేశాలు ఏర్పాటుచేసి సాగువైపు అడుగులు వేసేవిధంగా చూడాలని ఆదేశించారు. రైతులకు ఆయిల్‌పామ్ సాగుకు, ఇతర పంటల సా గుకు ఉన్న తేడా, లాభాలు, కూలీల వ్యధలు వంటి వాటిని వివరించాలని అన్నారు. అదే విధంగా ఆయిల్‌పామ్ సాగుచేసే రైతులకు ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీని వివరించాలన్నారు. ఇప్పటికే సాగు చేసిన రైతుల అనుభవాలను వారితో పంచుకునే విధంగా వారితో సమావేశం ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లా సొసైటీ అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు (పీఏసీఎస్) పరిధిలో 130 ఎకరాల ఆయిల్‌పామ్ సాగుచేసే విధంగా లక్ష్యం నిర్దేశించామన్నారు. ఈ పంట సాగుకు అవసరమైన బిందు సేద్య పరికరాలను 12.5 ఎకరాల వరకు ఎస్సీఎస్టీలకు ఉచితం అని, బీసీలకు 90 శాతం, చిన్న, సన్నకారు రైతులకు 80 శాతం రాయితీతో అందిస్తున్నట్లు తెలిపారు. ఆయిల్ ఫెడ్ డీవో రాధాకృష్ణ మాట్లాడుతూ.. ఆయిల్‌పామ్ యొక్క అవశ్యకత, సబ్సిడీ వివరాలను, ప్రయోజనాలను తెలియజేశారు. పీఏసీఎస్ పరిధిలోని రైతులు అందరూ ఈ అవకాశం సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని కోరారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా సొసైటీ అధికారి ఎ.శ్రీనివాస్, గోద్రెజ్ మేనేజర్ రామకృష్ణ, 21 మంది ఉద్యాన అధికారులు, సిబ్బంది, 21 మంది పీఏసీఎస్ సెక్రటరీలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అయిల్ ఫెడ్ డీవో రాధాకృష్ణ

దివ్యాంగుల చట్టం 2016 పోస్టర్లను ఆవిష్కరించిన భద్రాద్రి ఎస్పీ

భద్రాచలం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల చట్టం 2016 పోస్టర్లను భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ దివ్యాంగులను కించపరిచినా, అవహేలన చేసినా, గాయపరిచినా అసభ్య పదజాలంతో దూషించినా రెండేళ్ల జైలుశిక్ష, రూ.10వేల జరిమాన పడుతుందని పేర్కొన్నారు. ఈ చట్టంపై త్వరలో జిల్లా అధికారులతో అవగాహన సదస్సు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఊటుకూరి సాయిరాం, అన్నం సత్తిబాబు, కిష్టా శ్రీనివాసరావు, అలవాల రాజాపెరియార్, కొమ్మగిరి వెంకటేశ్వర్లు, అప్పన్న దాసుబాబు, మద్దెల లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న భద్రాద్రి ఎస్పీ

పర్ణశాల రామాలయంలో లడ్డూ ప్రసాదాల కొరత


దుమ్ముగూడెం, అక్టోబరు27 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన పర్ణశాల రామాల యంలో లడ్డూ ప్రసాదం భక్తులకు అందుబాటులో లేని విషయం సోమవారం వెలుగు చూసింది. చివరిసారిగా భద్రాచలం దేవస్థానం నుంచి ఈనెల 22న నాలుగు ట్రేల లడ్డూ ప్రసాదం పర్ణశాల రామాల యానికి చేరినట్లు తెలుస్తోంది. ఈనెల 26నే పర్ణశాలలో లడ్డూ ప్రసాదం అయిపోయినట్లు విశ్వసనీయ సమాచారం. సోమవా రం పర్ణశాల స్వామివారిని దర్శించుకున్న భక్తులు లడ్డూ ప్రసాదం అందుబాటులో లేకపోవడంతో నిరాశకు గురయ్యారు. ఈ విషయమై ఆలయ ఇంచార్జి శ్రీనివాస్‌ను వివరణ కోరగా, లడ్డూలు అందుబాటు లోనే ఉన్నాయన్నారు. కౌంటర్లో లడ్డూ ప్రసాదాలు లేవని యాత్రికులు ఎందుకు అంటున్నారని అడగ్గా, ఈరోజు ఆటోలో లడ్డూలను తీసుకొస్తు న్న క్రమంలో మార్గం మధ్యలో ఆటో మరమ్మతులకు గురవడంతో తామే వెళ్లి తెచ్చుకోవాల్సి రావడంతో కొంత ఆలస్యమైనట్లు తెలిపారు.


ఖాళీగా ఉన్న లడ్డూ కౌంటర్

అశ్రునయనాల మధ్య మేఘనాథ్ అంత్యక్రియలు

వీడ్కోలు పలికిన వల్లభి వాసులు

ముదిగొండ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కర్నూలులో జరిగిన ట్రావెల్స్ బస్సు దగ్ధం ఘటనలో సజీవ దహనమైన చిట్టోజు మేఘనాథ్(25) అంత్యక్రియలు ఆయన స్వగ్రామం ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం వల్లభి గ్రామంలో సోమవారం పూర్తయ్యాయి. కుటుంబసభ్యులు, గ్రామ స్థుల ఆయనకు అశ్రునయనాల మధ్య వీడ్కోలు పలికారు. ఈనెల 24న ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో హైదరాబాద్ నుంచి బెంగళూరుకు వెళ్తున్న క్రమంలో ఆబస్సు కర్నూలు వద్ద రోడ్డు ప్రమాదానికి గురై.. ఆ తర్వాత మంటల్లో కాలిపోయిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో మేఘనాథ్ కూడా గుర్తుపట్టలేని విధంగా కాలిపోవడంతో డీఎన్ఏ పరీక్షలు నిర్వహించి.. ఆ రిపోర్టుల ఆధారంగా మేఘనాథ్ మృతదేహాన్ని ఆదివారం కుటుంబసభ్యులకు అప్పగించారు. ఆతర్వాత మృతదేహాన్ని కుటుంబసభ్యులు స్వగ్రామమైన వల్లభికి తీసుకురాగా.. చేతికొచ్చిన కొడుకు మాంసం ముద్దలా.. కనీసం చివరిచూపు కూడా చూసుకోలేని స్థితిలో ఇంటికి చేరడంతో తల్లిదండ్రులు శ్రీనివాసరావు, విజయలక్ష్మీ, చెల్లి యస్విని గుండెలవిసేలా రోదించారు. వారి రోదనలు చూసిన గ్రామస్థులు కూడా కంటతడి పెట్టారు. అనంతరం గ్రామంలో అంతిమయాత్ర నిర్వహించి.. వారి వ్యవసాయ క్షేత్రంలో ఖననం చేశారు.


మేఘనాథ్(ఫైల్)

ఫోన్లో పరామర్శించిన డిప్యూటీ సీఎం

బస్సు ప్రమాదంలో మృతిచెందిన మేఘనాథ్ అంత్యక్రియలు వల్లభిలో జరగ్గా.. డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క కుటుంబసభ్యులకు ఫోన్‌చేసి పరామర్శించారు. మేఘనాథ్ తండ్రి శ్రీనివాసరావుతో మాట్లాడిన ఆయన సంఘటన వివరాలను అడిగి తెలుసుకుని సంతాపం తెలిపారు.

టౌన్ ఫ్లవర్ మర్చంట్స్ సంఘ కార్యాలయం ప్రారంభం

ఖమ్మంస్పోర్ట్స్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): నగరంలోని భక్తరామదాసు కళాక్షేత్రం వద్ద టౌన్ ఫ్లవర్ మర్చంట్స్ సంఘ కార్యాలయాన్ని సోమవారం ఆ సంఘ గౌరవ సలహాదారుడు షేక్ మహ్మద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో పూలు అమ్ముకుని జీవనం సాగిస్తున్న సుమారు 300మందికి ఎలాంటి సమస్యలు ఉన్నా కార్యాలయంలో యూనియన్ సభ్యులు అదుబాటులో ఉండి పరిష్కరిస్తారని అన్నారు. కార్యక్రమంలో పూల వ్యాపారుల సంఘం బాధ్యులు షేక్ మోయిన్, ఖాజా, శ్రీను, సర్దార్, డుంగ్రోతు శేఖర్, రామక్రిష్ణ, వెంకన్న తదితరులు ఉన్నారు.

రక్తదానం చేయండి: రూరల్ ఏసీపీ

నేలకొండపల్లి, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): రక్తదానం చేయటం ద్వారా, ప్రాణాపాయంలో ఉన్న ప్రాణాలను కాపాడాలని ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం నేలకొండపల్లి పోలీస్‌స్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఏసీపీ మాట్లాడుతూ పోలీసు అమరుల స్మారకార్థం ఈనెల 31న పోలీసుల ఆధ్వర్యంలో నేలకొండపల్లి మార్కెట్ యార్డులో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రమాదాలకు గురైన వారు, తలసేమియా బాధితులు చాలా సందర్భాల్లో రక్తం దొరక్క తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అటువంటి వారి ఇబ్బందులను ప్రధానంగా తలసేమియా బాధితులను దృష్టిలో ఉంచుకుని రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఏసీపీ చెప్పారు. స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ పార్టీల కార్యకర్తలు, కార్మిక సంఘాలు, యువత మెగారక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కూసుమంచి సీఐ టి.సంజీవ్, ముదిగొండ ఎస్‌హెచ్‌ఓ ఓ.మురళి, నేలకొండపల్లి ఎస్‌ఐ పి.సంతోష్ పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులు పెండింగ్ ఉండొద్దు

అదనపు కలెక్టర్ శ్రీజ

ఖమ్మంకలెక్టరేట్, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో ప్రజల నుంచి అందిన దరఖాస్తులను ఆయా శాఖల అధికారులు సత్వరమే పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి.శ్రీజ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపుకలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డితో కలిసి ఫిర్యాదులు స్వీకరించారు. ఈసందర్భంగా వివిధ శాఖల వారీగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై ఆమె సమీక్షించారు.ల్యాండ్‌సర్వేకు సంబంధించి30, మునిసిపల్ కార్పోరేషన్‌లో 15, నీటిపారుదల శాఖలో 14, డీఆర్డీవోలో 14 విద్యాశాఖలో 12 ఇలా 34 శాఖల్లో 201 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని వీటిని తక్షణమే పరిష్కరించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో ఏ.పద్మశ్రీ, డీఆర్డీఓ ఎన్.సన్యాసయ్య, జిల్లా అధికారులు డీఎస్వో చందన్‌కుమార్,డీఎంహెచ్‌వో కళావతిబాయి,ఆర్‌ఎంవో బి.రాంబాబు, పంచాయతీరాజ్ ఎస్‌ఈ వెంకటరెడ్డి పాల్గొన్నారు.





ఫిర్యాదులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య

కేఎంసీలో ఫిర్యాదులు స్వీకరించిన కమిషనర్ అగస్త్య

ఖమ్మంకార్పొరేషన్: ప్రజావాణిలో వచ్చిన వినతులను తక్షణమే పరిష్కరించాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశించారు. నగర పాలక సంస్థలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో వినతులు స్వీకరించారు. ఇందిరమ్మపట్టా కోసం ఓ మహిళ తన కుటుంబసభ్యులతో సహా వచ్చి కమిషనర్ ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో స్పందించిన కమిషనర్ సమస్య పరిష్కారానికి కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. సమస్యను పరిష్కారం చేయాలని డిప్యూటేషన్ ఉద్యోగి పవన్‌కు ఆదేశించారు. గత సోమవారం దీపావళి సెలవ్‌తో ప్రజావాణి నిర్వహించక పోవటంతో సోమవారం ప్రజావాణిలో రికార్డుస్థాయిలో 41దరఖాస్తులు అందాయి. కాగా పాతమునిసిపల్ కార్యాలయంలో దరఖాస్తులు అందించేందుకు వెళ్లగా అక్కడ ఉద్యోగులు సరిగా పట్టించుకోలేదని ఓదంపతులు వివరించారు.

కలప తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత

కామేపల్లి,అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా ఏజెన్సీ మండలంలో యథేచ్ఛగా కలప రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను ఫారెస్ట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కామేపల్లి మండలం పండితాపురం బండిపాడు సరిహద్దులో అనుమతులు లేకుండా కలపను లోడ్ చేస్తున్నట్లు జిల్లాఅటవీశాఖ అధికారులకు సమాచారం అందింది. దీంతో అధికారులు ట్రాక్టర్‌ను పండితాపురంలో పట్టుకొని సీజ్ చేశారు. కారేపల్లి అటవీ రేంజ్ కార్యాలయానికి తరలించారు. తరలిస్తున్న ట్రాక్టర్‌ను, తరలిస్తున్న అక్రమార్కులపై కేసు నమోదు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.



త్రీటౌన్‌లో జోనల్ కార్యాలయం ప్రారంభం

తొలి రోజు దరఖాస్తుల స్వీకరణ



జోనల్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మేయర్

ఖమ్మంకార్పొరేషన్, అక్టోబరు27 (ఆంధ్రజ్యోతి): ప్రజల వద్దకే పరిపాలన నినాదంతో నగరంలో జోనల్ వ్యవస్థను నిర్మాణం చేశారు. స్థానిక ప్రజలు ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయం వరకు వ్యయ, ప్రయసల కోర్చి రాకుండా వారి సమీపంలోనే జోనల్ కార్యాలయంలో సమస్యలపై వినతులు తీసుకొని వాటిని ఆయా విభాగాల అధికారులు పరిష్కారం చేస్తారని మేయర్ పునుకొల్లు నీరజ పేర్కొన్నారు. సోమవారం త్రీ టౌన్ 32వ డివిజన్‌లోని జమలాపురం కేశవరావు పార్కులో మూడో జోనల్ కార్యాలయాన్ని మేయర్ ప్రారంభించారు. 17, 27, 28, 29, 30, 31, 32, 33, 34, 35, 36, 47, 47, 48, 59, 60 డివిజన్ల ప్రజలు నగర పాలక సంస్థలో అందే సేవలు స్థానికంగా అందజేస్తారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి మేయర్ దరఖాస్తులు స్వీకరించారు. డీసీ శ్రీనివాస్, ఏఎంసీ అనిల్, ఈఈ కృష్ణలాల్, ఉద్యాన అధికారి బెల్లం రాధిక పాల్గొన్నారు.

రైతు వేదికల్లో నేడు వ్యవసాయ అవగాహన కార్యక్రమాలు

ఖమ్మంఅర్బన్,అక్టోబరు27(ఆంధ్రజ్యోతి):రఘునాథపాలెం మండలంలోని పలుగ్రామాల రైతువేదికల వద్ద మంగళవారం పలు వ్యవసాయ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని మండల వ్యవసాయాధికారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా మంగళవారం రాంక్యాతండా, రఘునాధపాలెం, వీవీ పాలెం, రైతువేదికల వద్ద కపాస్ కిసాన్ యాప్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

ఘనంగా కార్తీక సోమవారం పూజలు

ఖమ్మంరూరల్,అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవాలయాల్లో కార్తీక సోమవారం పూజలను నిర్వహించారు. తీర్థాల సంఘమేశ్వరాలయంలో భక్తులు తెల్లవారుజాము నుంచే త్రివేణి సంఘంలో పుణ్య స్నానాలు అచరించారు. మద్దులపల్లి శివాలయం, ముత్తగూడెం తదితర గ్రామాల్లోని భక్తులు భారీగా హాజరయ్యారు.

రామలింగేశ్వర స్వామి దేవాలయంలో ఎంపీ పూజలు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి సోమవారం ఖమ్మంలోని సువర్ణయంత్ర సహిత శ్రీపార్వతీసమేత రామలింగేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీ ఆలయమంతా తిరిగి విశేషాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మిక్కిలినేని మంజుల నరేంద్ర, కాంగ్రెస్ నాయకులు కొప్పుల చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

గుంటు మల్లేశ్వర స్వామి వారిని దర్శించుకున్న న్యాయాధికారులు

ఖమ్మంలీగల్: ఖమ్మం ట్రంకు రోడ్డులోని గలశ్రీ గుంటు మల్లేశ్వర స్వామి ఆలయంలో మొదటి కార్తీక సోమవారం సందర్భంగా ఒకటవ అదనపు జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె.ఉమాదేవితో పాటు ఖమ్మం ప్రిన్సిపల్ సినియర్ సివిల్ జడ్జి ఎం.కల్పన గుంటుమల్లేశ్వరస్వామి దేవాలయంలో అభిషేక కార్యక్రమంలో పాల్గొన్నారు.



గుంటు మల్లేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



రామలింగేశ్వరాలయంలో ఆశీర్వచనం తీసుకుంటున్న ఎంపీ

సామాజిక బాధ్యత అలవర్చుకోవాలి

ఖమ్మంరూరల్, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): చదువుతో పాటు సామాజిక బాధ్యత కూడా అలవరుచుకోవాలని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డి.రాజ్యలక్ష్మి అన్నారు. మండల పరిధిలోని ఎంవెంకటాయపాలెంలో ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాల ఆధ్వర్యంలో ఎన్‌ఎస్‌ఎస్ స్పెషల్ క్యాంపు ను సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రన్సిపల్ డి.రాజ్యలక్ష్మి, ఇంటర్మీడియట్ జిల్లా అధికారి కె.రవిబాబులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవోశ్రీదేవి, ఇన్‌స్పెక్టర్‌రాజారాం,గుర్రం అచ్చయ్య,బందెలవెంకయ్య, రామయ్య, యాదయ్య, వెంకన్న, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

ఉపకార వేతనాలు విడుదల చేయాలి

ఖమ్మంరూరల్, అక్టోబర్ 27(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలను విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐజిల్లా అధ్యక్షుడు పొనుకుల సుధాకర్ డిమాండ్ చేశారు. సోమవారం జలగంనగర్‌లో ర్యాలీ నిర్వహించారు.ఈనెల 30న జరిగే బందును విజయవంతం చేయాలన్నారు.

పోలీస్ స్టేషన్‌కు టీవీ వితరణ



టీవీని అందజేస్తున్న సైదులు

నేలకొండపల్లి, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): సీసీ కెమేరాల మానిటరింగ్‌కు ఉపయోగపడేందులకు మండల పరిధిలోని పైనంపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు యడవల్లి సైదులు టీవీని సోమవారం నేలకొండపల్లి పోలీసులకు అందించారు. టీవీని ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి చేతుల మీదుగా నేలకొండపల్లి ఎస్‌ఐసంతోష్‌కు అందచేశారు. అన్నిగ్రామాల్లో సీసీ కెమేరాలను ఏర్పాటు చేయటం వలన నేరాలను నియంత్రించవచ్చన్నారు. నేరాలు జరిగిన సమయంలో సీసీ కెమేరాలల్లో రికార్డైన ఫుటేజీల ద్వారా నేరస్తులను సాధ్యమైనంత త్వరగా పట్టుకోవటానికి వీలవుతుందని ఏసీపీ అన్నారు. ఈ టీవీని పైనంపల్లి గ్రామ పంచాయతీలో ఉంచుతామని ఎస్‌ఐ చెప్పారు. కార్యక్రమంలో సీఐలు సంజీవ్, మురళి, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు యడవల్లి నాగరాజు, మారగాని అంజయ్య, మారగాని గోవర్ధన్ పాల్గొన్నారు.

బీజేపీ క్రమశిక్షణ కలిగిన పార్టీ

ఖమ్మంబైపాస్‌రోడ్, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): బీజేపీ బూత్‌స్థాయి నుంచి జాతీయస్థాయి వరకు క్రమశిక్షణ కలిగినపార్టీ అని పార్టీ రాష్ట్ర కోశాధికారి దేవకి వాసుదేవరావు అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో పార్టీ సిద్ధాంత, సంస్థాగత అంశాలపై సమావేశం నిర్వహించగా, ఈకార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నెల్లూరికోటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు వీరవల్లి రాజేష్, పాల్గొన్నారు.

సీసీఐలోనే పత్తి అమ్ముకోవాలి

తిరుమలాయపాలెం, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): సీసీఐ కొనుగోలుకేంద్రాల్లో పత్తి అమ్మి మద్దతు ధర పొందాలని కూసుమంచి ఏడీఏ బి.సతీష్ తెలిపారు. సోమవారం మండలంలోని భాగ్యలక్ష్మికాటన్ మిల్లులో ఏర్పాటు చేసిన సీసీఐ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. మండలంలోని పిండిప్రోలు, దమ్మాయిగూడెం, జల్లేపల్లి, బచ్చోడు గ్రామాల్లోని ఎరువుల షాపులు తనిఖీచేశారు. ఈకార్యక్రమంలో ఏవో సీతారాంరెడ్డి, పాల్గొన్నారు.

మలీదు జగన్ స్ఫూర్తితో ముందుకు

ఖమ్మంకార్పొరేషన్, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): దివంగత మాజీకార్పొరేటర్ మలీదు జగన్ స్ఫూర్తితో ముందుకు వెళ్తామని, ఆయన చేపట్టాల్సిన అభివృద్ధి పనులను ఇప్పటికే మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లి పనులు ప్రారంభించామని కాంగ్రెస్ నాయకుడు మలీదు మనిష్ పేర్కొన్నారు. సోమవారం 3వడివిజన్ బల్లేపల్లిలో జగన్ ప్రథమ వర్ధంతి సందర్భంగా అన్నం పౌండేషన్, మదర్‌థెరిస్సా స్వచ్ఛంద సంస్థలో అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. డివిజన్‌లోని పారిశుద్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. మలీదు నాగమణి, డివిజన్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



దుస్తులు పంపిణీ చేస్తున్న మనీష్

సీపీఐ శతాబ్ది ఉత్సవ ముగింపు సభను జయప్రదం చేయండి

జిల్లా నాయకుడు కర్నాటి

నేలకొండపల్లి,అక్టోబరు27(ఆంధ్రజ్యోతి):సీపీఐ శతాబ్ది వేడుకల సందర్భంగా డిసెంబరు 26న ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా నాయకుడు కర్నాటి భానుప్రసాద్ పిలుపునిచ్చారు. సోమవారం కర్నాటి భవన్‌లో జరిగిన పార్టీ మండల కౌన్సిల్ సమావేశంలో భానుప్రసాద్ మాట్లాడుతూ సీపీఐ వందేళ్ల చరిత్రను, నిర్వహించిన ప్రజాఉద్యమాలను, చేసిన పోరాటాలను ప్రచారం చేయాలని కోరారు. యువతరంలో పార్టీ ఉద్యమ స్ఫూర్తిని రగిలించటమే శతాబ్ధి ఉత్సవాల ముగింపు లక్ష్యమని కర్నాటి పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో మండల కార్యదర్శి మారిశెట్టి వెంకటేశ్వరరావు, నాయకులు కనక బండి సీతారాములు, కర్నాటి నళినీరాణి, పోలంపల్లి నారాయణ, చావా గణపతిరావు, కాశిబోయిన అయోధ్య, మేకల పుల్లయ్య, పాలపాటి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

శతాబ్ది ఉత్సవాల ముగింపు సభను జయప్రదం చేయాలి

బోనకల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ఖమ్మంలో డిసెంబరు 26న జరగనున్న సీపీఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు, బెజవాడ రవిబాబులు కోరారు. మండలంలోని కలకోట, ఆళ్లపాడు గ్రామాల్లో సోమవారం ఆ పార్టీ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కమ్యూనిస్టు పార్టీ నిర్బంధంలో పుట్టి పెరిగిన పార్టీ అని, పేదల కోసం నిస్వార్థంగా పని చేస్తున్నది కమ్యూనిస్టులు మాత్రమేనన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, ఆకేన పవన్, మాతంగి శ్రీనివాసరావు, యంగల పెద్ద రమేష్, బలుగూరి అచ్చయ్య, బెజవాడ నరేష్, నర్సింహారావు, ధనరాజ్, పుల్లయ్య, వెంకటమ్మ, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సంస్కరణల సర్క్యులర్‌ను ఆపాలి

» రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు

కొణిజర్ల, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అక్టోబరు9న రాష్ట్రప్రభుత్వాలకు పంపిన విద్యుత్ సంస్కరణల సర్క్యులర్ అమలు జరిగితే తెలంగాణ రాష్ట్ర రైతులకు మరణశాసనం అవుతుందని తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. సోమవారం కొణిజర్లలో దారగాని రాములు అధ్యక్షతన జరిగిన మండల మహాసభ లో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం రైతుసంఘం మండల అధ్యక్షుడు చింతనిప్పు నరసింహారావు, ప్రధాన కార్యదర్శి దొడ్డపనేని కృష్ణార్జునరావు, ఉపాధ్యక్షుడు యరమల మాధవరెడ్డి, దారగాని రాములు, సహాయ కార్యదర్శులు తాతా వెంకయ్య, చింతనిప్పు వెంకయ్య, డేవిడ్, విజయరాజు సభ్యులను ఎన్నుకున్నారు. ఈమహాసభలో రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేష్, సీనియర్ నాయకులు కొప్పుల కృష్ణయ్య, చింతనిప్పు చలపతిరావు, వ్యకాసం జిల్లా ఉపాధ్యక్షుడు తాళ్లపల్లి కృష్ణ, సీఐటీయూ జిల్లానాయకుడు చెరుకుమల్లి కుటుంబరావు, రైతుసంఘంమండల కార్యదర్శి యరమల మాధవరెడ్డి, బోయినపల్లి శ్రీనివాసరావు, దొడ్డపనేని కృష్ణార్జున్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సత్తుపల్లి అభివృద్ధికి రూ.15 కోట్లు

» ప్రజా అవసరాల కోసం నిధుల మంజూరు
» హర్షం వ్యక్తం చేసిన పట్టణవాసులు

సత్తుపల్లిరూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి మునిసిపాలిటీలో ప్రజా అవసరాల కోసం రూ.15కోట్ల నిధులను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ఇన్నిరోజుల పాటు భారీ పనులు చేపట్టేందుకు నిధులు లేనికారణంగా వెనకడుగు వేయగా తాజాగా మంజూరైన నిధులతో సత్తుపల్లి పట్టణ రూపురేఖలు మారనున్నాయి. ఇందులో భాగంగా స్టామ్ వాటర్ డ్రైనేజీలు, సీసీ, బీటీ రోడ్లు, ఇండోర్, అవుట్‌డోర్ స్టేడియంల నిర్మాణాలకు కేటాయించనున్నట్లు మునిసిపల్ కమీషనర్ కొండ్రా నర్సింహ్మా తెలిపారు. వెంటనే టెండర్లు పిలిచి పనులు చేపట్టనుండగా ఇప్పటికే ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వానికి అందింది. పాలకవర్గాలు, ప్రత్యేక అధికారులతో సంబంధం లేకుండా ప్రభుత్వం అనుమతులు ఇవ్వనుండగా పనులు శరవేగంగా పూర్తయ్యే అవకాశం ఉంది. ఈ క్రమంలో అభివృద్ధిలో జిల్లాలోనే సత్తుపల్లి మునిసిపాలిటీ ముందడుగు వేయనుందని కమిషనర్ చెప్పారు.



సత్తుపల్లి మునిసిపల్ కార్యాలయం

నగరాభివృద్ధికి బడ్జెట్‌లో కేటాయించిన నిధులతో పాటు మౌలిక వసతుల అభివృద్ధి నిధులు (యూఐడీఎఫ్) రూ.15కోట్లు సత్తుపల్లి మునిసిపాలిటీకి మంజూరయ్యాయి. ప్రాధాన్యతా క్రమంలో గర్ల్స్ హైస్కూల్ వెనుక రూ.2కోట్లతో ఇండోర్ స్టేడియం నిర్మాణం, జేవీఆర్ కళాశాల మైదానంలో రూ.3కోట్లతో నిర్మించే అవుట్ డోర్ స్టేడియంలో రన్నింగ్ ట్రాక్, వాలీబాల్, టెన్నిస్ కోర్ట్, సీటింగ్ గ్యాలరీ, పాత్‌వేస్, లైటింగ్, ఓపెన్ జిమ్, ఎంట్రన్స్ ఆర్చ్, చైన్‌లింక్ మెస్, ఫ్లడ్‌లైట్స్, మొక్కల పెంపకం, టాయిలెట్లు ఏర్పాటు చేస్తారు. అదేవిధంగా రూ.10కోట్లతో పట్టణంలో 23వార్డులలో వరదనీటిని మళ్లించేందుకు స్టార్మ్ వాటర్ డ్రైనేజీలు, సీసీ, బీటీ రోడ్లు నిర్మిస్తామన్నారు.

పట్టణాన్ని గ్రోత్ హబ్‌గా తీర్చిదిద్దుతాం...

● కొండ్రా నర్సింహ్మా, కమిషనర్, సత్తుపల్లి మునిసిపాలిటీ



సత్తుపల్లి మునిసిపాలిటీని సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు ప్రజా అవసరాలను తీర్చడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. ఎమ్మెల్యే మట్టా రాగమయి చొరవతో రాష్ట్రప్రభుత్వం విడుదల చేసిన నిధులతో సత్తుపల్లి మునిసిపాలిటీని గ్రోత్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ఇప్పటికే ప్రణాళికలు రూపొందించాం. క్రీడాభివృద్ధితో పాటు పట్టణ ప్రజల ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు ఈ నిధులను వెచ్చించనున్నాం. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఇండోర్ స్టేడియం, అవుట్ డోర్ స్టేడియం నిర్మాణాలు, తదితర నిర్మాణాలను మార్చిలోపు పూర్తిచేస్తాం.

పాఠశాలకు మైక్ వితరణ

తల్లాడ, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): మండలం మల్లారం ప్రాథమిక పాఠశాలకు కటికి వెంకయ్యనాయుడు- లోవ లక్ష్మి దంపతులు మైక్‌సెట్‌ను సోమవారం ఎంఈవో నెమ్మకంటి దామోదరప్రసాద్ చేతుల మీదుగా అందించారు. ఈసందర్భంగా వెంకయ్యనాయుడు దంపతులను సన్మానించారు. ఈకార్యక్రమంలో హెచ్‌ఎం బి.హరిబాబు, ఉపాధ్యాయులు అనిల్‌కుమార్, కె.వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలని వినతి

కారేపల్లి, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): మండల పరిధి గేటుకారేపల్లిలోని ఎస్సీ కాలనీలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కాలనీవాసులు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా డీవైఎఫ్‌ఐ మండల కార్యదర్శి అదర్ల వినయ్ కుమార్ మాట్లాడుతూ గేటుకారేపల్లిలో సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో కుంట విజయ్, వాకాటి పృథ్వీ, గడ్డం దిలీప్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే మెరుగైన వైద్య సేవలు



సత్తుపల్లిలో ట్రాక్టర్, పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే మెరుగైన వైద్య సేవలు అందుతాయని, ప్రజారోగ్యం ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. సోమవారం సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు.

సింగరేణి సీఎస్ఆర్ నిధులతో మంజూరైన రూ.14లక్షలతో సత్తుపల్లి, పెనుబల్లి ఆసుపత్రులలో అవసరమైన పరికరాలను కొనుగోలు చేయనున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 66మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. చంద్రాయపాలెం వీఎస్ఎస్ సభ్యులు రాజిన్ని సురేష్‌కుమార్, పొండ్ల బాబులకు మంజూరైన రూ.10లక్షల విలువైన ట్రాక్టర్‌ను స్థానిక నీలాద్రి అర్బన్‌పార్క్‌లో పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఎఫ్‌వో వాడపల్లి మంజుల, రేంజర్ స్నేహలత పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే

కల్లూరు: మండలంలోని కొర్లగూడెం, లక్ష్మీపురం గ్రామాల్లో సోమవారం ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బాగం నీరజదేవి, పసుమర్తి చందర్‌రావు, భూక్యా శివకుమార్‌నాయక్, బాగం ప్రభాకరచౌదరి తహసీల్దార్ సాంబశివుడు, ఎంపీడీవో చంద్రశేఖర్, ఐకేపీ ఏపీఎం ఆశోకారాణి పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టంతో చదవాలి



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న గురుకుల ప్రిన్సిపాల్ రమ

వైరా, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తమ భవిష్యత్ కోసం ఇష్టంతో కష్టపడి చదవాలని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ సూచించారు. సోమవారం వైరాలోని తెలంగాణ గురుకుల బాలికల పాఠశాల, జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఇన్‌స్పైయిర్ అండ్ ఇగ్నైట్ యూత్ ట్రాన్స్‌ఫర్‌మేషన్ మిషన్ వారు నిర్వహించిన ప్రొవిషనల్ డవలప్‌మెంట్ ట్రైనింగ్‌ప్రోగ్రాంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రిన్సిపాల్ బత్తుల రమ, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, ఏన్కూరు ఏఎంసీ చైర్మన్ గుగులోతు లచ్చీరామ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, వైరా మునిసిపల్ మాజీ చైర్మన్ సూతకాని జైపాల్, వైరా, కొణిజర్ల మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, వడ్డే నారాయణ పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల సమస్యలు పరిష్కరించాలి: సీపీఎం

వైరా, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): వైరా ప్రభుత్వ జూనియర్ కళాశాల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీపీఎం డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం డిమాండ్ చేశారు. సోమవారం వైరా ప్రభుత్వ జూనియర్ కళాశాలను తమ పార్టీ బృందంతో కలిసి వీరభద్రం సందర్శించి సమస్యల గురించి పరిశీలించారు. అలుగుబెల్లి నర్సిరెడ్డి ఎమ్మెల్సీగా రూ.25లక్షలు మంజూరు చేసినా భవన నిర్మాణ పనులు ప్రారంభమైనా ఆనిధులు విడుదల చేయకపోవడంతో భవనం అసంపూర్తిగా ఉండటాన్ని తీవ్రంగా ఖండించారు. సమస్యలపై ప్రిన్సిపాల్ నవీనజ్యోతితో మాట్లాడారు. సుంకర సుధాకర్, చింతనిప్పు చలపతిరావు, కొంగర సుధాకర్, పైడిపల్లి సాంబశివరావు, గుడిమెట్ల మోహన్‌రావు, అమరనేని కృష్ణ పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి



సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్మన్ నర్సింహారావు

మధిర రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రైతులు సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని మధిర వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నర్సింహారావు సూచించారు. మధిర మండలం మాటూరు మంజిత్ కాటన్ మిల్లులో ఏర్పాటుచేసిన సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాంబాబు, ఏఎంసీ వైస్ చైర్మన్ అయిలూరి సత్యనారాయణరెడ్డి, మార్కెట్ సెక్రటరీ చంద్రశేఖర్, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్, మిరియాల వెంకటరమణగుప్తా పాల్గొన్నారు.

మహిళలంతా చైతన్యవంతం కావాలి

సత్తుపల్లిరూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఇళ్లు, ఇళ్లస్థలాలు, విద్యవైద్యం అందరికీ అందాలన్నా, 33శాతం రిజర్వేషన్ అమలు జరగాలన్నా మహిళలంతా చైతన్యవంతంగా.. ఐక్యంగా ప్రభుత్వంపై పోరాడేందుకు సంసిద్ధం కావాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మీ అన్నారు. సోమవారం సత్తుపల్లిలో నిర్వహించిన ఐద్వా డివిజన్ మహాసభలో ఆమె పాల్గొని మాట్లాడారు. అనంతరం డివిజన్ కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మాచర్ల భారతి, బండి పద్మ, మెరుగు రమణ, ఎస్.హైమావతి, పాకలపాటి ఝాన్సీ, జాజిరి జ్యోతి, జొన్నలగడ్డ సునీత, శీలం కరుణ, గుడిమెట్ల రజిత, తన్నీరు కృష్ణవేణి, రత్నకుమారి, మిట్టపల్లి నాగమణి, రాణీ రుద్రమదేవి తదితరులు పాల్గొన్నారు.

జమలాపురం ఆలయంలో పూజలు



ఎర్రుపాలెం, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): జమలాపురం శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీక సోమవారం సందర్భంగా సోమవారం సామూహికసత్యనారాయణ స్వామివ్రతం నిర్వహించారు. ఆఆలయ ప్రధాన అర్చకుడు ఉప్పల శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజ లు నిర్వహించారు. ఈకార్యక్రమంలో అర్చకులు మారుతి రఘురామకృష్ణ, భక్తులు పాల్గొన్నారు.

తల్లాడ/కల్లూరు, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం తొలి సోమవారం సందర్భంగా దేవాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున పుణ్యస్నానాలు ఆచరించి శివాలయాల్లో పూజలు నిర్వహించారు.

రైతులకు పరిహారం ఇవ్వాలి

కొణిజర్ల, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పత్తి, పెసర పంటలకు ఎకరానికి రూ.50వేలు నష్టపరిహారం ఇవ్వాలని సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆందోళన నిర్వహించింది. ఈసందర్భంగా పార్టీజిల్లా కార్యదర్శివర్గసభ్యుడు తాళ్లపల్లి కృష్ణ మాట్లాడారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈకార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి చెరుకుమల్లి కుటుంబరావు, కొప్పుల కృష్ణయ్య, చలపతిరావు, దొడ్డపనేని కృష్ణార్జున్‌రావు, కట్ల రాంబాబు, నరసింహారావు, నారాయణ, వెంకటేశ్వర్లు, రాములు, మాధవరెడ్డి పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

వైరా, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలని కోరుతూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్‌కు సోమవారం వినతిపత్రం సమర్పించారు. పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి గోకినపల్లి మస్తాన్, అజయ్, శ్రీకాంత్, ఉప్పల్, తిరుమల్ పాల్గొన్నారు.

భూగర్భ విద్యుత్ లైన్లు మధిరకు వరం

మధిర, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): మధిర పట్టణంలో భూగర్భ విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయడం ఒక వరమని జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి వేమిరెడ్డి శ్రీనివాస రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్ అన్నారు. సోమవారం మధిర పట్టణంలో రూ.28 కోట్లతో ఏర్పాటు చేయనున్న భూగర్భ విద్యుత్ లైన్ల శంకుస్థాపన సభాస్థలిని కాంగ్రెస్ నాయకులతో కలిసి పరిశీలించారు. మధిర ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మల్లాది వాసు, రంగా హనుమంతరావు, నిడమానూరు వంశీ, కరివేద సుధాకర్, పాటిబండ్ల సత్యంబాబు, కర్నాటి రామారావు, ఈది అనిల్ కుమార్ నెహ్రూ, పారుపల్లి విజయ్, కోనా ధనికుమార్, దేవిశెట్టి రంగారావు, రంగా శ్రీను తదితరులున్నారు.

సెల్‌ఫోన్ అందజేత

వైరా, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిరిపురం గ్రామానికి చెందిన కృష్ణార్జున్‌రావు అనే వ్యక్తి తాను పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను సోమవారం ఎస్ఐ పుష్పాల రామారావు బాధితుడికి అప్పగించారు. వైరాలోని శాంతినగర్ సమీపంలో ఉన్న పర్చూరి గార్డెన్ వద్ద ఆప్రాంతానికి చెందిన దనావత్ రాంబాబుకు సుమారు రూ.30వేల విలువైన సెల్‌ఫోన్ దొరికింది. ఆసెల్‌ఫోన్‌ను ఎస్ఐ రామారావుకు రాంబాబు అప్పగించారు. తర్వాత విచారణ ఎస్ఐ ఆధారాలు పరిశీలించి బాధితుడు కృష్ణార్జున్‌కు ఈ సెల్‌ఫోన్‌ను అప్పగించారు. రాంబాబును ఎస్ఐ అభినందించారు.